ప్రజా తపన
prajathapana.com
News that matters



**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**

సంపుటి :01 సంచిక:72 ఆదివారం 30 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-



# మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ -శుభాకాంక్షలు తెలిపిన బిల్‌గేట్స్

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

దేశ ప్రజలతో మమేకం కావలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రతీ నెల చివరి ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ రేడియో ద్వారా దేశ ప్రజలతో తన మనసులోని మాటను పంచుకుంటారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంతో పాటు.. దేశంలో పలువురు ప్రముఖుల గురించి, ప్రదేశాల గురించి, సామాన్యుల విజయాల గురించి ప్రస్తావిస్తుంటారు ప్రధాని. ఈ నేపథ్యంలోనే.. ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమంపై ప్రజల్లోనూ ఆసక్తి పెరిగింది. ప్రతి



నెల చివరి ఆదివారం నాడు ప్రధాని ఏ విషయం గురించి మాట్లాడుతారా? అని దేశమంతా ఎదురు చూస్తుంటుందనడంలో ఏమాత్రం సంశయం లేదు.కాగా, ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం తాజాగా 100వ ఎపిసోడ్‌కు చేరువైంది. ఏప్రిల్ 30వ తేదీన జరిగే ఎపిసోడ్‌తో 100వ ఎపిసోడ్ పూర్తవనుంది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ రూ.100 కాయిన్?ను విడుదల చేయనున్నారు. అలాగే, అనేక అంశాలపై కీలక ప్రసంగం చేయనున్నారు.ఈ క్రమంలోనే ప్రధాని మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ఉద్దేశించి ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. 'మన్ కీ బాత్.. పారిశుధ్యం, ఆరోగ్యం, మహిళల ఆర్థిక సాధికారత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉన్న ఇతర సమస్యలపై ప్రజల్లో చైతన్యాన్ని కలిగించింది.' అని పేర్కొన్నారు బిల్‌గేట్స్.

# విశాఖలో అదానీ డాటా సెంటర్




**ప్రత్యక్షంగా 40 వేల మందికి ఉపాధి**

**విశాఖపట్నం**

ఆంధ్రప్రదేశ్ లో డేటా సెంటర్, ఐటీ పార్కుల అభివృద్ధి కోసం అదానీ గ్రూపు భారీగా పెట్టుబడులు పెట్టనుంది. ఏకంగా, రూ. 21,844 కోట్ల భారీ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ తో పాటు బిజినెస్ ఐటీ పార్కు, స్కిల్ కాలేజీ, రీక్రియేషన్ సెంటర్లను అభివృద్ధి చేసే విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖ పట్నంలోని మధుర వాడ సమీపంలో కాపులుప్పాడ వద్ద ఎకరం కోటి రూపాయల చొప్పున 190.29 ఎకరాలను అదానీ గ్రూపుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అదానీ గ్రూపు పెట్టదలచిన డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. మొదట 130 ఎకరాల్లో 200 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన అదానీ గ్రూపు.. ఆ తర్వాత మరో 100 మెగావాట్ల డేటా సెంటర్ ను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా

02



## వచ్చే నెలలోనే నష్ట పరిహారం - సీఎం జగన్

**విజయవాడ**

గన్నవరం ఎయిర్ పోర్ట్ నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వచ్చే నెలలోనే 44 కోట్లు క్లియర్ చేస్తానని హామీ ఇచ్చారు. సుమారు ఏడేళ్లుగా పరిహారం కోసం ఫైట్ చేస్తున్న వారికి ముఖ్యమంత్రి నిర్ణయం ఊరట కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత గన్నవరం ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయంగా మారింది. రన్ వే విస్తరణ కోసం 2016 లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భూములను సేకరిం చింది.

02

# సచివాలయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**గంట లోపే కార్యక్రమం సమాప్తి**

**శత్రు దుర్భేద్యంగా నయా సెక్రటేరియెట్**

**హైదరాబాద్**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ సౌధం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భవనం, ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేసారు. శనివారం మధ్యాహ్నం నుంచి అలంకరణ పనులు ప్రారంభం అయ్యాయి. ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించే యాగం కోసం సచివాలయ ప్రాంగణంలో హోమశాల కుడా సిద్ధమైంది. సుదర్శన యాగం, చండీహోమం నిర్వహించనున్నారు. రహదార్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు యాగంలో పాల్గొంటారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట 20 నిమిషాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సచివాలయానికి చేరుకుంటారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సచివాలయ



సంఘం అధ్యక్షుడు నరేందర్రావు సీఎంకు స్వాగతం పలుకుతారు.

గంటలోపే ప్రారంభోత్సవం పూర్తి

సీఎం కేసీఆర్ తన కుర్చీలో కూర్చున్న తర్వాత మంత్రులు తమ ఛాంబర్లకు వెళ్లి కుర్చీల్లో కూర్చొంటారు. మంత్రులు అందరూ కూడా తమ శాఖకు సంబంధించిన ఒక దస్త్రంపై సంతకం చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట 58 నిమిషాల నుంచి 2 గంటల 4 నిమిషాల వరకు అధికారులు కుర్చీల్లో కూర్చొని ఒక దస్త్రంపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. దీంతో ప్రారంభోత్సవ ఘట్టం గంటలోపే పూర్తి కానుంది.

ముఖ్యమంత్రికి స్వాగతం

02


# హెచ్-1బీ వీసా లాటరీ సిస్టమ్‌లో మోసాలపై హెచ్చరించిన అమెరికా

**వాషింగ్టన్:**

హెచ్-1బీ వీసాదారుల ఎంపిక కోసం ఉపయోగించే కంప్యూటరైజ్డ్ లాటరీ సిస్టమ్‌లో మోసాలు జరుగుతున్నట్లు అగ్రరాజ్య అమెరికా గుర్తించింది. కొన్ని కంపెనీలు తమ విదేశీ ఉద్యోగులకు వీసాలు దక్కే అవకాశాలను పెంచుకునేందుకు ఈ లాటరీ వ్యవస్థను మోసగిస్తున్నట్లు తేలింది. దీంతో హెచ్-1బీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధునీకరించేందుకు అమెరికా ఫెడరల్ ఏజెన్సీ సిద్ధమైంది.

అమెరికా కంపెనీలు నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను నియమించుకునేందుకు హెచ్-1బీ వీసా అనుమతి కల్పిస్తుంది. టెక్నాలజీ కంపెనీలు దీనిపై ఆధారపడి ఏటా భారత్, చైనా వంటి దేశాల నుంచి

02




# ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

**అమరావతి:**

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. జి.అనంతరామును బీసీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన సంక్షేమ విభాగానికి అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా జి.జయలక్ష్మి బదిలీ అయ్యారు. రజత్ భార్గవ్ నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను తప్పించిన ప్రభుత్వం ఆయన్ను ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా



# యం ఏ తెలుగు రెండవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

**విశాఖపట్నం. ప్రజా తపన.**



సాంస్కృతిక కార్యక్రమం లో మారిషస్ విద్యార్థినీ వెంకనాహ్ సాహినాహ్

ఆంధ్రవిశ్వకళాపరిషత్ ,తెలుగు విభాగ సమావేశమందిరంలో లో యం ఏ తెలుగు రెండవ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సర విద్యార్థులచే వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వీడ్కోలు వేడుకల కార్యక్రమానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు సభాధ్యక్షులుగా వ్యవహారించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య జి యోహాన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానవీయ సంబంధాలు మెరుగుపర్చుకోవాలని ఇంటికి అలంకారప్రాయంగా గాక అందంగా అలంకరించే వస్తువు వలె వ్యక్తి ఎదిగినప్పుడే కుటుంబానికి సమాజానికి విలువ ఉంటుందని, విద్యార్థి దశలో నేర్చుకునే విద్య కంటే ఇప్పుడు జీవితం లో నేర్చుకునే పాఠాలే ఎక్కువ గా ఉంటాయని వాటిని ఆకళింపు చేసుకొంటూ అవగాహనతో ముందుకు నడుస్తూ తన జీవన సోపానాన్ని తామే ఏర్పరుచుకోవాలని తెలియజేసారు.విద్యార్థులు ప్రాచీన సాహిత్యం లో కథల ద్వారా మానవీయ నైతిక విలువలు గ్రహించాలన్నారు.ఆధునిక సాహిత్యం ద్వారా సమసమాజంలో ఉన్న సాంఘిక రుగ్మతలను రూపుమాపడానికి కవులు చేసిన ప్రయత్నాలను గ్రహించి ఈ రెండు సాహిత్యాల మేళవింపుతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు.అప్పుడే సమాజ పురోభివృద్ధికి తాను ఏమి చేయగలమనే దృక్పథం అలవడుతుందన్నారు.ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ విద్యార్థి దశ చాల క్లిష్టమైనదని దానిని అధిగమించిన వ్యక్తి దేనినైనా సాధిస్తాడని అందుకు క్రమశిక్షణ ,సమయపాలన,ఆశయం అనే సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా పాటించాలన్నారు .విద్యార్థులు సృజనశీలతను పెంపొందించుకుంటూ మృదు నైపుణ్యాలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకున్నప్పుడు ఏ వ్యక్తి అయినా అత్యున్నత స్థానాన్ని అందుకోగలడన్నారు.మనిషి మనీషిగా ఎదిగినప్పుడే జీవితం సార్థకం అవుతుందన్నారు. సమావేశ అనంతరం విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం లో తెలుగు ఆచార్యులు డా అన్నంశెట్టి ఈశ్వరమ్మ ,డా బూసి వెంకటస్వామి ,డా కట్టెపోగు రత్నశేఖర్ ,డా పెండ్యాల లావణ్య ,శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు (యోగి ),అధ్యాపకేతర సిబ్బంది ,పరిశోధక విద్యార్థులు ,స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు

# విశాఖలో అదానీ డాటా సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు పేర్కొంది. దీంతో మరో 60.29 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదానీ గ్రూపు విశాఖ టెక్ పార్క్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. మే 3న అదానీ గ్రూపు అధికారుల సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డేటా సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నారు. ఉద్యోగాల కల్పన ఆధారంగానే రాయితీలు, ప్రోత్సాహకాలను ఇచ్చే విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సర్కారు వీటీపీఎల్ తో ఒప్పందం చేసుకుంది. మొత్తం 5 దశల్లో ఈ ప్రాజెక్టును మొత్తంగా 7 సంవత్సరాల్లో పూర్తి చేయనున్నారు. ఇక ఈ ప్రాజెక్టు ద్వారా 39,815 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామని వీటీపీఎల్ సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొంది. మొదటి దశలో మూడేళ్ల కాలంలో కనీసం 40 మెగావాట్ల డేటా సెంటర్ ను అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు 30 శాతం మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించాల్సి ఉంటుందని ఏపీ సర్కారు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 4 సంవత్సరాల్లో 50 శాతం మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఏడేళ్లలో పూర్తిగా 39,815 మందికి ఉపాధి కల్పించాలని స్పష్టంగా పేర్కొంది. 300 మెగావాట్ల డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా 1,860 మందికి ఉపాధి లభించనుండగా, ఐటీ బిజినెస్ పార్క్ ద్వారా 32 వేల మందికి పైగా ఉపాధి దొరకనుంది. అలాగే స్కిల్ కాలేజీ, రీక్రియేషన్ సెంటర్ల ద్వారా మరో 3 వేల మందికిపైగా ఉపాధి దొరికే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొదట కేటాయించిన 130 ఎకరాల్లో 82 ఎకరాలు డేటా సెంటర్ కు, ఐటీ బిజినెస్ పార్కుకు 28 ఎకరాలు, స్కిల్ కాలేజీకి 11 ఎకరాలు, రిక్రియేషన్ కేంద్రానికి 9 ఎకరాలను కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం. భూమి పూజ జరిగిన తర్వాత వెను వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ముందుగా స్పష్టంగా చేసినట్లుగా నిర్దిష్ట వ్యవధిలో పనులు పూర్తి కావడంతో పాటు ఉపాధి లభించనుంది.

# వచ్చే నెలలోనే నష్ట పరిహారం - సీఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల 5 గ్రామాలకు చెందిన 662 మంది రైతులు సుమారు 800 ఎకరాల భూములు ప్రభుత్వానికి అప్పగించారు. కొంతమంది భూములతో పాటు ఇళ్లు కూడా కోల్పోయారు. అప్పట్లో ఎమ్మెల్యే గా వంశీ హామీ ఇవ్వడంతో భూములను ప్రభుత్వానికి అప్పగించారు. అయితే ఏడేళ్లయినా ఇప్పటికీ పరిహారం అందక పోవడంతో ధర్నాలు చేయడంతో పాటు కొంతమంది కోర్టును కూడా ఆశ్రయించారు..ఇదే అంశంపై గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ ను కలిశారు..వాస్తవంగా గత ప్రభుత్వం లోనే పరిహారం అందించాల్సి ఉందని..కానీ పట్టించుకోలేదని సీఎం జగన్ కు వివరించారు వంశీ?నిర్వాసితులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు తెలిసింది..వచ్చే నెలలోనే పరిహారం కింద 44 కోట్లు చెల్లిద్దామని వంశీకి హామీ ఇచ్చారు జగన్..ఇప్పటికే నిర్వాసితుల వివరాలు, అందించాల్సిన పరిహారం పై లెక్కలు సిద్ధం చేశారు అధికారులు. దీనికి అనుగుణంగా నిధులు విడుదల చేసేందుకు సీఎం జగన్ పూర్తి హామీ ఇచ్చినట్లు తెలిసింది. 2016లో చంద్రబాబు ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండానే ఖాళీ చేయించిందట. ఇప్పుడు వారికి వచ్చే నెల్లోనే నష్ట పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

# సచివాలయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పలికే సమయంలో, ప్రారంభోత్సవ ఫలకాన్ని ఆవిష్కరించే సమయంలో, వాస్తుపూజ సమయంలో ఎక్కువ మంది ఉండకుండా చూస్తున్నారు. ఏకకాలంలో పూజలు జరిగేలా భారీ సంఖ్యలో రుత్విక్కులను భాగస్వామ్యం చేస్తున్నారు. వంద మంది రుత్విక్కులు క్రతువులో పాల్గొంటున్నారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు.

**సీఎం సంక్షేమ సంతకం**

సచివాలయ ప్రారంభోత్సవం వేళ సీఎం కేసీఆర్ పలు ప్రతిపాదనల దస్త్రాలపై సంతకం చేయనున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం చేయనున్నారు. దళిత బంధు పథకం రెండో విడత విధి విధానాలనూ కేసీఆర్ ఆమోదించనున్నారు. వీటితో పాటు వివిధ వర్గాల విద్యార్థులకు విదేశీ విద్యా పథకం కింద నిధులు మంజూరు చేయనున్నారు. గృహ లక్ష్మి పథకం విధి విధానాల రూపకల్పనకూ సీఎం కేసీఆర్ ఆదేశించనున్నారు.

కొత్త సచివాలయం శత్రుదుర్భేద్యం! సెక్యూరిటీ కన్నుగప్పి చీమ కూడా లోపలికి దూరలేదు! సెక్రటేరియట్ చుట్టూ ఐదంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. సుమారు 470 మంది సిబ్బంది నిరంతరం పహారా కాస్తుంటారు. అక్టోపస్ నుంచి స్పెషల్ యూనిట్ గస్తీలో ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉంది. సచివాలయానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించే బాధ్యతను ఖాఖా చూసుకుంటుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయానికి ఐదంచెల భద్రత ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సచివాలయాన్ని శత్రుదుర్భేద్యంగా మారుస్తున్నారు. నూతన సచివాలయానికి పటిష్టమైన భద్రత కల్పించే బాధ్యతను డీజీపీ అంజనీకుమార్ తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ కు అప్పగించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మించిన నూతన సచివాలయాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇంద్రభవనాన్ని తలపిస్తున్న సచివాలయాన్ని చూసేందుకు ఇప్పటికే ఎంతోమంది సందర్శకులు క్యూ కడుతున్నారు. సచివాలయం ప్రారంభమైన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజల రాకతో సచివాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయే అవకాశం ఉన్నందున భద్రతాపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సచివాలయానికి పోలీస్ శాఖ ఐదంచెల భద్రతను ఏర్పాటు చేసింది.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాఖా నుంచి మూడు కంపెనీల బలగాలు నిరంతరం గస్తీ కాస్తాయి. సచివాలయానికి పక్కనే అమరవీరుల స్థూపం, అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహం, ఎన్టీఆర్ ఘాట్, పక్కనే హుస్సేన్ సాగర్, నెక్లెస్ రోడ్ ఈవెంట్స్, ఆ పక్కనే ఐమాక్స్ ఉండటం, ఆ ప్రాంతమంతా టూరిస్ట్ స్పాట్‌గా మారడంతో భద్రతాపరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఖాఖా బెటాలియన్ నుంచి ఒక్కో కంపెనీలో 90 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో ముగ్గురు కమాండెంట్లు, ఆరుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు సిబ్బంది ఆరుగురు, ఆర్ఎస్ఐలు 12 మంది, ఏఎస్ఐలు 18 మంది, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 90 మంది ఉంటారు. ఇలా మూడు కంపెనీల నుంచి మొత్తం 270 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. పాత సచివాలయానికి కేవలం 150 మంది ఎస్పీఎఫ్ సిబ్బందితో రక్షణ కల్పించేవారు. కొత్త సచివాలయానికి ఆ సంఖ్య నాలుగింతలు పెరిగింది. కంపెనీల బలగాలకు తోడు ఆక్టోపస్ నుంచి ఓ యూనిట్‌ను సచివాలయ భద్రతకు కేటాయించారు. ఈ స్పెషల్ యూనిట్‌లో మొత్తం 21 మంది సిబ్బంది ఉంటారు. వీరికి ర్యాంకులవారీగా విధి విధానాలు ఉంటాయి. సిటీ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన 80 మంది సిబ్బంది కూడా సచివాలయ భద్రతలో భాగం కానున్నారు. వీరు ప్రత్యేకంగా చెకింగ్, బ్యాగేజీ చెకింగ్, బాంబ్, మెటల్ చెకింగ్ వంటి విధులు నిర్వర్తిస్తారు. ఈ విభాగంలో అడిషనల్ డీసీపీ ర్యాంకు అధికారి ఒకరు, ఏసీపీ ర్యాంకు అధికారులు ముగ్గురు, ఆర్ఐలు ఆరుగురు, ఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉంటారు. వీరితోపాటు సివిల్ పోలీసుల (సివిల్ ఫోర్స్) నుంచి ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, మిగతా సిబ్బంది మొత్తం కలిపి 32 మంది కేవలం సచివాలయ భద్రత కోసం పనిచేస్తారు. ఇంటలిజెన్స్ విభాగం నుంచి అడిషనల్ ఎస్పీ ఒకరు, ఏసీపీ ఒకరు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది భద్రతలో భాగమవుతారు. ఇక స్పెషల్ బ్రాంచ్ నుంచి ఏసీపీ, సీఐ, ఇద్దరు ఎస్ఐలు, సుమారు 8 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తారు.సచివాలయ పరిసరాల పరిధిలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందుకోసం సుమారు 25 మంది ట్రాఫిక్ సిబ్బంది షిఫ్టులవారీగా విధులు నిర్వర్తిస్తారు. ప్రస్తుతం సెక్రటేరియట్‌కు 22 మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, మిగిలిన ర్యాంకుల సిబ్బంది ఉంటారు. వీరు సెక్రటేరియట్ పార్కింగ్, సీఎం మూమెంట్, మంత్రుల పార్కింగ్, విజిటర్స్ పార్కింగ్, ఉద్యోగులు, పౌరుల కోసం పనిచేస్తారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ భారీ విగ్రహం, సచివాలయ ప్రాంతాలకు ఎక్కువగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉండటంతో.. సచివాలయంలోకి వెళ్లే ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు విధులకు ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ సిబ్బందిని సిద్ధం చేశారు. ట్రాఫిక్ రద్దీ పెరిగిన మరుక్షణమే సిబ్బందిని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక నుంచి అంబేద్కర్ నూతన సచివాలయం భద్రతను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ చూసుకుంటుంది. సిటీ పోలీస్, ఆక్టోపస్, ఇంటలిజెన్స్, ట్రాఫిక్ వంటి విభాగాలను సమన్వయం చేసుకొంటూ కట్టుదిట్టమైన భద్రతను కల్పిస్తారు. రక్షణ విషయంలో రాజీ లేకుండా పహారా కాసే మూడు కంపెనీల సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. మొత్తం 300 మందిని సిద్ధంగా ఉంచారు. వీరంతా త్వరలో విధుల్లో చేరే అవకాశం ఉంది. రాబోయే కాలంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పౌరులు, సచివాలయ భద్రత దృష్ట్యా సిబ్బందిని మరింత పెంచే అవకాశం ఉంది. నూతన సచివాలయ భద్రతకు సంబంధించి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో)గా టీఎస్ఎస్పీ 3వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.వెంకట్రాములుకు బాధ్యతలు అప్పగించారు. కొత్త సచివాలయానికి పటిష్టమైన భద్రతను అందించేందుకు సుమారు 468 మంది సిబ్బంది నిరంతరం విధులు నిర్వర్తిస్తుంటారు. భద్రత విషయంలో రాజీ పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

# హెచ్-1బీ వీసా లాటరీ సిస్టమ్‌లో మోసాలపై హెచ్చరించిన అమెరికా

(మొదటిపేజీ తరువాయి)

వేలాది మంది ఉద్యోగులను నియమించుకుంటాయి. ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది ఈ వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. కంప్యూటరైజ్డ్ లాటరీ ద్వారా ఎంపిక చేసి అర్హులైన వారికి వీసాలు జారీ చేస్తుంటారు. ఈ లాటరీ ప్రక్రియలో కొన్ని కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ గుర్తించింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఓ అసాధారణ ప్రకటన విడుదల చేసింది.

వీసాలను దక్కించుకునే అవకాశాలను పెంచుకోవడం కోసం కొన్ని కంపెనీలు ఒకే దరఖాస్తుదారు పేరుతో అనేక రిజిస్ట్రేషన్లను లాటరీలోకి ఎంటర్ చేస్తున్నట్లు తాము గుర్తించామని USCIS తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరానికి గానూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇటీవల చేపట్టగా.. అంతక్రితం పోలిస్తే పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చినట్లు యూఎస్‌సీఐఎస్ పేర్కొంది.

“హెచ్-1బీ వీసాల కోసం ఈ ఏడాది కంప్యూటర్ జనరేటెడ్ లాటరీలో ఏకంగా 7,80,884 దరఖాస్తులు వచ్చాయి. 2023 సంవత్సరానికి ఈ సంఖ్య 4,83,927గా ఉండగా.. 2022లో 3,01,447, 2021లో 2,74,237 మంది దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా రెండు సందర్భాల్లో ఈ సంఖ్య అమాంతం పెరుగుతంది. ఒకే లబ్ధిదారు ఎక్కువ సార్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు లేదా ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నప్పుడు ఈ సంఖ్య పెరుగుతుంది. ఈ ఏడాది 4,08,891 మంది ఒకటి కంటే ఎక్కువ సార్లు లాటరీలో రిజిస్టర్ చేసుకున్నారు. గతేడాది ఈ సంఖ్య 1,65,180 మాత్రమే. కంపెనీలు తమ ఉద్యోగులకు వీసాలు రావాలనే దురుద్దేశంతో ఇలా ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నాయి” అని %ఖూజ×ూ% అని వెల్లడించింది. దీనిపై తాము దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొంది. తప్పుడు సమాచారంతో దరఖాస్తులు చేసుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

మరోవైపు, ఈ మోసాల ఘటనల నేపథ్యంలో తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధునీకరించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు USCIS తెలిపింది. “మా వలస వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ అత్యంత ముఖ్యమైనది. ఈ ప్రక్రియలో మోసాలు, దుర్వినియోగాన్ని తగ్గించేందుకు రిజిస్ట్రేషన్ విధానాన్ని మరింత బలోపేతం చేస్తాం” అనిUSCIS వెల్లడించింది.

# శిర్డీసాయి భక్తులకు గుడ్ న్యూస్, బంద్ ఉపసంహరణ!

**శిర్డీ**

శిర్డీ సాయిబాబా ఆలయానికి భద్రత పెంచడాన్ని గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. మే ఒకటో తేదీ నుంచి బంద్ పాటిస్తామని ప్రకటించింది. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. స్థానిక ప్రతినిధులు చెప్పిన డిమాండ్లకు తలొగ్గింది. శిర్డీ ఆలయంలోని సీఐఎస్ఎఫ్ భద్రత పెట్టకుండా ప్రభుత్వం తరపున హైకోర్టులో పోరాడతామని మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ వీకే పాటిల్ ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. దాంతో పాటు స్థానికుల మరికొన్ని డిమాండ్లను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో మే ఒకటో తేదీ నుంచి బంద్ పాటిస్తామని చెప్పిన గ్రామస్థులు.. దాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.శిర్డీలోని సాయి బాబా ఆలయానికి మరితం భద్రత కల్పించాలని సాయి సంస్థాన్ ట్రస్ట్ పెద్దలు, మహారాష్ట్ర పోలీసులు నిర్ణయించారు. అందులో భాగంగా ఆలయానికి సీఐఎస్ఎఫ్ భద్రతను ఏర్పాటు చేయడంపై కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని శిర్డీ గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం సాయిబాబా ఆలయ భద్రతా ఏర్పాట్లను సాయి సంస్థాన్ సిబ్బంది చూస్తున్నారు. ఆలయ ప్రాంగణ భద్రతను మహారాష్ట్ర పోలీసులు చూసుకుంటున్నారు. ఆలయాన్ని ప్రతి రోజూ బాంబు స్క్వాడ్ తనిఖీ చేస్తుంది. సామాజిక కార్యకర్త సంజయ్ కాలే 2018లో బాంబే హైకోర్టులోని ఔరంగాబాద్ బెంచ్ లో ఆలయ భద్రతపై ఒక పిటిషన్ దాఖలు చేశారు.

# ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించాలని నిర్ణయించింది. యువజన, క్రీడలు, సాంస్కృతికశాఖ అదనపు బాధ్యతలు రజత్ భార్గవ్ వద్దే ఉంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ బాధ్యతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలో ఉంటాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీసీఎల్ఏ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్‌కు మైనార్టీ శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. జి.లక్ష్మి షాకు గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

## భర్తను హత్య చేసి అనారోగ్యంతో మృతి చెందినట్లు చిత్రీకరణ

**ఏలూరు:**

అల్లూరి జిల్లా పాడేరులో దారుణ ఘటన జరిగింది. భర్తను హత్య చేసి అనారోగ్యంతో మృతి చెందినట్లు క్రియేట్ చేసిందో మహిళ. జి.మాడుగుల మండలం నేరేడువలస గ్రామానికి చెందిన ఉద్రాక్ష హరి విజయ్ ను ఈ నెల 18న అతని భార్య ప్రీతి... తన భర్తను ఆరోగ్యం బాలేదని పాడేరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకువచ్చింది. పాడేరు ఆసుపత్రిలో జాయిన్ చేసి ఏ అనుమానం రాకుండా చికిత్స పొందుతూ మరణించినట్లు చిత్రీకరించింది. విజయ్ మృతిపై అనుమానస్పద కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టుమార్టం, కాల్ డేటా ఆధారంగా విజయ్ ది సహజమరణం కాదు హత్యగా నిర్ధారించారు. ప్రీతి, ఆమె తండ్రి శంకర్ రావు, మరికొంత మంది కలిసి చోడవరం మారుతీ నగర్ లోని వారి ఇంటి వద్దనే విజయ్ ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుని మామ, ప్రీతి తండ్రి సమారెడ్డి శంకర్ రావు ను అరెస్టు చేసిన పాడేరు పోలీసులు.. కేసును చోడవరం పోలీసులకు బదిలీ చేశారు.అల్లూరి జిల్లాలో ఫైనాన్స్ వ్యాపారి భార్య ఘాతుకానికి పాల్పడింది. తండ్రితో కలిసి భర్తను హత్య చేసింది. జి.మాడుగుల మండలం నేరేడువలస గ్రామానికి చెందిన లోంజ ఉద్రాక్ష హరి విజయ్ ది హత్యేనని పోలీసులు తేల్చారు. ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ చివుకుచింతకి చెందిన సమరెడ్డి ప్రీతితో హరి విజయ్ కు 2014లో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. విజయ్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఫైనాన్స్ వ్యాపారం విషయంలో భార్యాభర్తలిద్దరికి తరచూ గొడవలు వచ్చేవి. విజయ్ ను చంపేయాలని ప్రీతి, ఆమె తండ్రి కుట్ర పన్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి విజయ్ కు స్నేహితులతో కలిసి మద్యం తాగించారు. మత్తులో ఉన్న విజయ్ ముఖంపై దిండుతో నొక్కి హత్య చేశారు. 18వ తేదీ ఉదయం మృతదేహాన్ని కారులో పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి గుండెపోటుతో కోమాలోకి వెళ్లిపోయాడని డ్రామా ఆడారు. అప్పటికే విజయ్ మృతి చెందినట్లు వైద్యులు స్పష్టం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసిన పోలీసులు... కాల్ డేటా, పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా ప్రీతి సహా ఏడుగురిని నిందితులను గుర్తించారు. ప్రీతి తండ్రి శంకరరావును అరెస్టు చేశారు. పరారీలో ఉన్న విజయ్ భార్య ప్రీతితో పాటు మరొక ఐదుగురి కోసం గాలింపు చేపట్టారు.

## ఫ్లోటింగ్ జెట్టీతో గంగపుత్రులు...వెలుగురేఖలు

**విజయనగరం:**

విజయనగరం గంగపుత్రుల జీవితాల్లో వెలుగురేఖలు విచ్చుకోనున్నాయి. ఆధునిక వసతులను సమకూర్చడం ద్వారా, మత్స్యకారుల జీవన భృతికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వీటిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం మలుపుగా చెప్పవచ్చు. సుమారు రూ.23.73 కోట్ల ఖర్చుతో విజయనగరం జిల్లా పూసపాటి రేగ మండలం చింతపల్లి వద్ద నిర్మితమయ్యే ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులను, మే 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రారంభిస్తారు. ఈ జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు జిల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. పర్యాటక పరంగా కూడా చింతపల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. విజయనగరం జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో, పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి సముద్ర తీరం వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (ఫ్లోటింగ్ జెట్టీ)ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఇప్పటికే ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించారు. చింతపల్లితోపాటు చుట్టుప్రక్కల ప్రాంతంలోని తిప్పలవలస, మద్దూరు, కొత్తూరు, బర్రిపేట, నీలగెద్దపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపాలెం, పతివాడ బర్రిపేట తదితర చోట్ల 16 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో అతిపెద్దదైన చింతపల్లి వద్ద ఈ ఫ్లోటింగ్ జెట్టీని నిర్మించాలని నిర్ణయించారు. దీనికి సుమారుగా రూ.23.73కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.విజయనగరం జిల్లాలో సుమారు 21.44 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం వల్ల సుమారు 4వేల మత్స్యకార కుటుంబాల్లోని 20 వేలమందికి మేలు జరుగుతుంది. జిల్లాలో గుర్తించబడిన 711 మోటరైజ్డ్ ఫిషింగ్ బోట్లు, 417 సంప్రదాయ పడవలు ఉన్నాయి. ఒక్క చింతపల్లి ప్రాంతంలోనే 487 మోటరైజ్డ్ ఫిషింగ్ క్రాఫ్ట్, 361 సంప్రదాయ పిషింగ్ బోట్లు ఉన్నాయి. రాష్ట్రంలో పూడిమడక తరువాత, చింతపల్లే రెండో పెద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా చెప్పవచ్చు. ఇక్కడ జెట్టీ నిర్మాణం వల్ల మత్స్యకారులు నిర్భయంగా సముద్రంలోకి వెళ్లే అవకాశం లభిస్తుంది. రాత్రి పగలూ చేపల వేటకు వెళ్లొచ్చు. మత్స్యకారులు తాము వేటాడిన చేపలను సులువుగా ఒడ్డుకు చేర్చడానికి వీలు అవుతుంది. మేలైన మత్స్య ఉత్పత్తులు ప్రజలకు సరఫరా అవుతాయి. తుఫాన్లు లాంటి సమయంలో జెట్టీ వల్ల మత్స్యకారుల పడవలకు రక్షణ లభిస్తుంది. లంగరు వేసుకోవడం సులువు అవుతుంది.సముద్ర తీరం నుంచి కెరటాలను దాటుకొని సముద్రంలోకి ప్రవేశించడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియ. అందుకే కెరటాలు దాటి వెళ్లడం పునర్జన్మతో పోలుస్తారు. ఈ సమయంలోనే ఎక్కువమంది మత్స్యకారులు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోతుంటారు. దీనికి భయపడి చాలామంది మత్స్యకారులు తమ వృత్తిని వదిలిపెట్టడం లేదా, జెట్టీ ఉన్న ప్రాంతానికి వలస వెళ్లిపోవడం జరుగుతోంది. విజయనగరం జిల్లాలో చేపలవేటలో అత్యంత నైపుణ్యం ఉన్న మత్స్యకారులు ఉన్నారు. వీరి నైపుణ్యానికి గొప్ప గుర్తింపు ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలోకి వెళ్లినా, విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులు కనిపిస్తారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పనిచేస్తున్న బోటు డ్రైవర్లలో సగం మంది విజయనగరం జిల్లాకు చెందినవారే కావడం గమనార్హం. జెట్టీ నిర్మాణం వల్ల వీరంతా తమ ప్రాంతాలకు తిరిగివచ్చి, ఇక్కడే తమ కులవృత్తిని నిర్వహించుకొనే అవకాశం లభిస్తుంది. తద్వారా పురుష?లతోపాటు మత్స్యకార మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు రెట్టింపవుతాయి. చింతపల్లిలో జెట్టీ నిర్మాణం జరిగితే, పర్యాటక పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే చింతపల్లి బీచ్ జిల్లాలో ఏకైక సముద్రతీర సందర్శనీయ ప్రాంతంగా ఉంది. చింతపల్లి లైట్ హౌస్ కూడా నిత్యం సందర్శకులను ఆకర్షిస్తుంటుంది. ఇక్కడి కొండ సుమారు ఐదు కిలోమీటర్ల మేర సముద్రంలోకి పొడుచుకుపోయి ఉంటుంది. ఈ ప్రాంతంలో వందేళ్ల క్రితం మునిగిపోయిన పడవ అవశేషాలు ఇప్పటికీ కనబడతాయని మత్స్యకారులు చెబుతారు. పర్యాటక ప్రదేశంగా ఈ కొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చు. అలాగే స్కూబా డైవింగ్ కు కూడా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది. భోగాపురం విమానాశ్రయానికి దగ్గర ప్రాంతం కావడంతో, జాతీయ రహదారి కూడా సమీపంలోనే ఉండటంతో, పర్యాటక కోణంలో కూడా చింతపల్లి బీచ్‌కు గొప్ప భవిష్యత్తు ఉందని చెప్పవచ్చు.విజయనగరం జిల్లాలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం నిజంగా అద్భుతమైన ఆలోచన. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రిని జీవితాంతం రుణపడి ఉంటాం. ఈ జెట్టీ నిర్మాణం వల్ల మత్స్యకారుల బతుకులు మారతాయి. మా ప్రాణాలకు రక్షణ లభిస్తుంది. ఉపాధి అవకాశాలు ఎన్నోరెట్లు పెరుగుతాయి. దశలవారీగా ఇక్కడ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తే, మరింత ప్రయోజనం చేకూరుతుంది.– బర్రి చిన్నప్పన్న, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షులు, ఫిష్ కోపెడ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్

## వానలతో నగరం పులకింత

**హైదరాబాద్ :**

తెలంగాణలో గత కొన్ని రోజులుగా వాతావరణం చల్లబడింది. సాయంత్రానికి ఉరుమురులు మెరుపులత వానలు పడుతున్నాయి. కొన్ని చోట్ల అయితే పెద్ద పెద్ద వడగళ్లు కూడా పడుతున్నాయి. మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో పడిన కుండపోతు వానతో హైదరాబాద్ వర్షాకాలాన్ని తలపించింది. ఇవాళ అదే పరిస్థితి కనిపిస్తుంది. రాత్రంతా ఆకాశం మేఘావృతమై కనిపించి నగరవాసులను చల్లబరిచింది వాతావరణం. ఉదయాని కల్లా చాలా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో వాన కుమ్మేస్తోంది. హైదరాబాద్ ఈ చివరి నుంచి ఆ చివరి వరకు ఏకధాటిగా కురుస్తోంది. ఎల్బీనగర్ నుంచి మొదలుకొని కోఠీ, అసెంబ్లీ, పంజాగుట్ట, అమీర్ పేట్, యూసఫ్‌గూడ, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, హైటెక్ సిటీ, మాదాపూర్ , కూకట్ పల్లి, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో రెండు గంటల నుంచి వర్షం కురుస్తోంది.ఉదయాన్నే విధులకు వెళ్లే ఉద్యోగులు వర్షంతో ఇబ్బంది పడుతున్నారు. శనివారమే అయినా ట్రాఫిక్ జామ్‌లు కాకుండా మురికి కాలువలు రోడ్లపైకి రాకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు బ్లాక్‌ల సమస్యను పరిష్కరిస్తున్నారు. అయినా కొన్ని లోతట్టు ప్రాంతాల్లో సమస్య ఉండనే ఉంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణలో మూడో తేదీ వరకు ఇలాంటి వాతావరణమే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. తెలంగాణలో చాలా ప్రాంతాల్లో ఇలాంటి చల్లని వాతావరణమే ఉంటుందంటున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డిలో వడగళ్ల వాన పడే అవకాశం ఉందని ఇవాళ 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చారు అధికారులు. ఎల్లో అలర్ట్ ఇచ్చిన జిల్లాలు సూర్యపేట, మహబూబ్‌నగర్, యాదాద్రి భవనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూల్‌లో ఇదే పరిస్థితి ఇవాళ రేపు ఉంటుందంటున్నారు వాతావరణ శాఖాధికారులు. ఎల్లుండి... ఆదిలాబాద్, కుమ్రం భీమ, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హనమకొండ, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ్‌పేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన పడేందుకు అవకాశం ఉంది. హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సీయస్, కనిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదు అయ్యే అవకాశం ఉంది. నిన్న కనిష్ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు అయితే గరిష్టం 32.8 డిగ్రీలుగా రిజిస్టర్ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లో కూడా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం చెబుతోంది. అన్ని జిల్లాలను అప్రమత్తం చేసింది. యానం పరిసర ప్రాంతాలు, రాయలసీమ ప్రాంతాల్లో పిడుగులు, ఉరుములతో కూడిన వర్షం పడొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం చెబబుతోంది. నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో గాలులు కూడా వీయొచ్చని ప్రకటించింది. రెండో తేదీ వరకు ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## వివాదంలో విశ్వరూప్ తనయుడు

**అమలాపురం:**

తండ్రి స్థానంలో ఎలాగైనా పాగా వేయాలన్న తపనో తెలియదు.. తండ్రి తరువాత వారసత్వం తనకే దక్కాలన్న ఆత్రుతో తెలియదు. మొత్తం మీద తనయుని తాపత్రయం మాత్రం చర్చకు దారితీస్తోంది. తండ్రి అరోగ్య పరిస్థితుల వల్ల తానే రంగంలోకి దిగాల్సి వచ్చిందని చెప్పుకుంటున్న మంత్రి కుమారుడికి చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. తాజాగా అమలాపురం అల్లర్ల కేసులకు సంబంధించి ప్రశ్నల వర్షం కురిపించిన కొందరు మీరు అసలు ఏ హోదాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నారని ప్రశ్నించడంతో మళ్లీ చర్చల్లోకి ఎక్కారు ఇంతకీ ఎవరా తనయుడు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సొంత నియోజకవర్గం అమలాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నియోజకవర్గంలో కార్యక్రమం టార్గెట్ పూర్తికాలేదు. అయితే ఇప్పటికే అమలాపురం అర్బన్, రూరల్, ఉప్పలగుప్తం మండలాల్లోని పలు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చాలా వరకు పూర్తి అయినా ఇంకా అల్లవరం మండలంలో చాలా గ్రామాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో వేగంగా టార్గెట్ పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తుండగా మంత్రి తనయుడు శ్రీకాంత్ ఆ బాధ్యతలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో అన్నీ తానై నడిపిస్తున్నారు. ఈనేపథ్యంలో పలు చోట్ల చేదుఅనుభవాన్ని ఆయన చవిచూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అల్లవరం మండలంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసీపీలోనే రెండు వర్గాల మధ్య రగడ నెలకొంది. ఇదే ప్రాంతానికి చెందిన చొల్లంగి రమణ అనే కార్యకర్త అమలాపురం అల్లర్ల ఘటనలో అమాయకులమైన వారిపై కేసులు పెట్టారని ప్రశ్నించాడు. అంతేకాకుండా అసలు మీరు ఏ హోదాతో ఇక్కడికి వచ్చారని ప్రశ్నించడం పెద్ద దుమారమే రేపింది. దీంతో అక్కడున్న మరికొంత మంది దీనిని తప్పుపట్టడం ఇలా మొత్తం పెద్ద దుమారమే లేచినంతపనైంది. ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగి రసాభాసగా మారి తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఏమైనా ఉంటే మంత్రి విశ్వరూప్‌ను అడగాలని ఓ వర్గం అంటే అలా అయితే ఈయన ఎందుకొచ్చాడని మరో వర్గం ఇలా మాటలయుద్ధమే నడిచింది. పరిస్థితిని గ్రహించిన మంత్రి తనయుడు సర్దిచెప్పి అక్కడి నుంచి వెనుతిరగాల్సి వచ్చింది.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ పాల్గొన్నప్పుడు అమలాపురం ఎంపీ చింతా అనురాధకు తగిన ప్రాధాన్యతనిచ్చి ఆమెతో కలిసే అడుగులు వేసేవారు. అయితే ప్రస్తుతం ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న మంత్రి తనయుడు శ్రీకాంత్ అన్నీ తానై పక్కనున్న వారికి కనీసం మాట్లాడే అవకాశం లేకుండా చేసుకుపోతున్నారని దీంతో విసుగెత్తిన ఎంపీ కార్యక్రమానికే దూరం అయిపోయారని పార్టీలోనే చెప్పుకుంటున్నారు. కోడూరుపాడు అనే ప్రాంతంలో పాల్గొన్న ఎంపీ మంత్రి తనయుడు శ్రీకాంత్ వ్యవహారశైలి నచ్చకే అక్కడి నుంచి అర్ధంతరంగా వెనుతిరిగారని పలువురు చెబుతున్నారు. ఇటీవలే విజయవాడలో జరిగిన ఎస్సీ నాయకుల సమాశంలో ఎంపీ మాట్లాడిన మాట వివరం తెలుసుకోకుండా మంత్రి విశ్వరూప్ కూడా ఎంపీ ఆమె అలా మాట్లాడడం ఆమె విజ్ఞతకే వదలేస్తున్నానని అనడం కూడా పెద్ద దుమారమే రేపింది. ఇంతకీ ఎంపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకుండానే మాట్లాడినట్లుగా భావించి మంత్రి అలా మాట్లాడడంతో ఎంపీ వర్గం తీవ్ర అసంతృప్తిలో ఉన్నారట. ఇటీవల నియోజకవర్గంలోని తుమ్మలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షున్ని ఆకస్మికంగా మార్చిన మంత్రి తనయుని తీరుపై ఆగ్రామంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఐ.ప్యాక్ ప్రతినిధి ప్రభాకరన్ సీన్‌లోకి ఎంటర్ అయ్యే పరిస్థితి వచ్చింది. అవరమైతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని వారు పట్టుపట్టి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో చివరకుఈ విషయం మంత్రి విశ్వరూప్ దృష్టికి వెళ్లి ఆయన పాత కమిటీనే కొనసాగిస్తాం.. అది తనకు తెలియకుండా జరిగిందని నచ్చచెప్పడంతో వివాదం సద్దుమనిగింది. ఏది ఏమైనా మంత్రి తనయుని తాపత్రయం మాత్రం అటు తండ్రికి కొత్తచిక్కులు తీసుకొస్తుండగా పార్టీకు మంచి కంటే నష్టమే జరుగుతోందని పలు గుసగుసలు వినిపిస్తున్నాయి.

## లాభాలతో వాణిజ్య పంటలు

**మహబూబ్ నగర్ :**

సంప్రదాయ పంటల సాగుతో అన్నదాత కు ఆశించిన లాభాలు రావడం లేదు. అందువల్ల అధిక దిగుబడి, లాభాలు వచ్చే వాణిజ్య పంటలపై దృష్టిపెడుతున్నారు. అయితే సాంప్రదాయ పంటల కంటే పండ్ల తోటల సాగులో లాభాలు ఉంటాయని ఆ దిశగా ఆసక్తి చూపుతున్నారు రైతులు. ఇందులో భాగంగానే నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన రైతు శేఖరయ్య బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. ఈ పంట వేసిన అనంతరం 5 నెలల్లోనే పూతకు వచ్చి ఆరో నెలలో కాయలు కాయడం మొదలవుతుందని రైతు వివరించాడు. త్వరగా పంట చేతికి రావడంతో మంచి లాభాలు కూడా గడించవచ్చని చెప్పుకొచ్చాడు.రైతు శేఖరయ్య ప్రస్తుతం ఆరు ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేశాడు. మొక్కలు నాటేందుకు రూ. 13 లక్షల వరకు ఖర్చు వచ్చిందని తెలిపారు. పంట నాటిన సమయం నుంచి క్రమ పద్ధతి ద్వారా శాస్త్రవేత్తలు సూచించిన విధంగా ఎరువులు మందులు డిఏపి వాడాడు. ప్రతి నెలా క్రమం తప్పకుండాం కావాల్సిన ఎరువులు అందించాడు. వీటితో పాటు డ్రిప్ సిస్టం ద్వారా బొప్పాయి తోటకు నీటిని సరఫరా చేశారు. తద్వారా ఐదు నెలల్లోనే పంట పూతకు వచ్చింది. 8 నెలలకు పంట చేతికి వచ్చిందన్నాడు. మార్కెట్లో బొప్పాయి పండ్లకు మంచి డిమాండ్ ఉండడంతో కిలో రూ. 30 నుంచి రూ. 40 వరకు ధర పలుకుతుందని.. తాము తోట వద్ద రూ. 25కు విక్రయిస్తున్నట్లు రైతు శేఖరయ్య తెలిపాడుగత ఐదు సంవత్సరాల నుంచి పండ్ల తోట సాగు చేస్తున్నామని గతేడాది మామిడి తోటను సాగు చేయడం ద్వారా కాస్త నష్టాలు రావడంతో ఈ ఏడాది బొప్పాయి తోటను ఎంచుకున్నామని వివరించాడు. మామిడి తోటలో వచ్చిన నష్టాలను బొప్పాయి సాగు ద్వారా పూడ్చుకోవచ్చనే ఉద్దేశంతో సాగు చేశామని చెప్పుకొచ్చాడు.అయితే పంటలో ఆశించిన మేర దిగుబడులు వచ్చినప్పటికీ ఈ ఏడూ వర్షాభావ పరిస్థితులు అధికంగా ఉండడంవల్ల బొప్పాయి చెట్లు దెబ్బతిని కొంత నష్టం వస్తుందని అన్నారు. వర్షాలు అధికంగా లేకపోతే మంచి ఆదాయం వచ్చేదని చెప్పారు. తాము పండించిన పంటను తోట వద్దనే విక్రయిస్తూ ఉన్నామని ఇతర పండ్ల వ్యాపారులకు హోల్ సేల్ ధరకు అమ్ముతున్నట్లు రైతు శేఖరయ్య తెలిపాడు.

## రాజమండ్రిలో టీడీపీ వర్సెస్ జనసేన

**రాజమండ్రి :**

రాజమండ్రి అర్బన్ టిక్కెట్ వ్యవహారం ఇప్పుడు టీడీపీలో హాట్ టాపిక్ అవుతోందట. ఈసారి కూడా సీటు తమ కుటుంబానికే ఖరారు చేశారని ఇటీవల సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు చేసిన ప్రకటనే ఇందుకు కారణమట. పనిలో పనిగా తన కుమారుడు వాసు ఈసారి పోటీలో ఉంటారని కూడా క్లారిటీ ఇచ్చేశారట ఆయన. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్తే వాసు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారాయన. వాళ్ళు ఎవరైనా.. ఏ పదవిలో ఉన్నా? పార్టీ టిక్కెట్ ఖరారు విషయాన్ని అధిష్టానం ప్రకటించాలిగానీ? ఎవరికి వాళ్ళు చెప్పేసుకోవడం ఏంటన్నది ఇప్పుడు రాజమండ్రి టీడీపీలో జరుగుతున్న చర్చ అట. వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి సిటీ టిక్కెట్ కోసం తానూ పోటీలో ఉంటానని ఇప్పటికే చాలాసార్లు చెప్పారు పార్టీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి. దీంతో ఆదిరెడ్డి, గోరంట్ల ఫ్యామిలీల మధ్య ఈసారి టిక్కెట్ వార్ తప్పదేమోనన్న అనుమానాలు కేడర్‌లో పెరుగుతున్నాయి. వచ్చే నెలలో టీడీపీ మహానాడు రాజమండ్రిలోనే జరగనుండటంతో? ఈ టిక్కెట్ వ్యవహారం ఆసక్తిగా మారిందట.పార్టీ ఆవిర్భావం నుంచి రాజమండ్రిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వరుసగా ఆరు సార్లు పోటీ చేశారు బుచ్చయ్యచౌదరి. 2014లో అనూహ్యంగా ఆయన్ని రూరల్ నియోజకవర్గానికి పంపింది అధిష్టానం. ఆ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సిటీ టిక్కెట్ ను బీజేపీకి కేటాయించింది. తర్వాత 2019లో కూడా బుచ్చయ్యను రూరల్‌కే పరిమితం చేసి సిటీ టిక్కెట్‌ను ఆదిరెడ్డి భవానీకి ఇచ్చింది నాయకత్వం. వైసీపీ హవాలో కూడా ఇద్దరూ గెలిచారు. కానీ.. బుచ్చయ్య తన సొంత నియోజకవర్గమైన రాజమండ్రి సిటీని వదులుకోలేకపోతున్నారట. అందుకే ఈసారి ఎలాగైనా తిరిగి అక్కడి నుంచి పోటీ చేయాలనుకుంటున్నారట. దీంతో ఈసారి ఈ వ్యవహారం అధిష్టానానికి తలనొప్పి కాబోతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆదిరెడ్డి అప్పారావు చేసిన వ్యాఖ్యలే అందుకు బలమిస్తున్నాయి.ఎవరెవరో టిక్కెట్ తమదే అంటుంటారనీ? చంద్రబాబు మాత్రం క్లారిటీ ఇచ్చేశారని, ఈ వ్యవహారానికి ఫుల్ స్టాప్ పడినట్టేనని కార్యకర్తలతో చెప్పారట అప్పారావు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో వెంటనే కౌంటర్ వేసే బుచ్చయ్య ఈసారి మాత్రం తొందరపడకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నారట. పైగా రూరల్‌లో తనపని తాను చేసుకుపోతున్నారట.ఆదిరెడ్డి వాసుని రాజమండ్రి ఎం.పీ అభ్యర్థిగా పోటీ చేయించాలని గతంలో ప్రతిపాదించింది టి.డి.పి అధిష్టానం. అందుకు తాను సుముఖంగాలేనని అప్పట్లో చెప్పారట ఆయన. దీంతో పీటముడి మరింత బిగుసుకుంటోందట.ప్రస్తుతం బుచ్చయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీకి పట్టు ఉంది. ఒకవేళ పొత్తు కుదిరితే..ఈ సీటును జనసేన ఖచ్చితంగా వదులుకోబోదని అంటున్నారు. అదే జరిగితే గోరంట్లకు టిక్కెట్ ఎక్కడ అనేది ప్రశ్నగా మారింది. అయితే ఈసారి టిక్కెట్ తమదేనని ఆదిరెడ్డి ఫ్యామిలీ ప్రకటించుకుంటోంది తప్ప అధినాయకత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు కదా? అన్న ప్రశ్నలు కూడా కేడర్‌లో ఉన్నాయట. గోరంట్లకు స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఆదిరెడ్డి కుటుంబం విషయంలో ఏకపక్ష నిర్ణయాలు చంద్రబాబు తీసుకోబోరన్న చర్చలు కూడా నడుస్తున్నాయట. మరోవైపు పక్కనే ఉన్న రాజానగరంలో టీడీపీ ఇన్ఛార్జ్ లేరు. దీంతో బుచ్చయ్య చౌదరిని అక్కడికి పంపవచ్చన్న ఊహాగానాలు సైతం ఉన్నాయి. మహానాడు టైంకి బుచ్చయ్య చౌదరి విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నాయి పార్టీ వర్గాలు

## అది రాజకీయ నిరుద్యోగ సభ

**నల్గొండ**

శుక్రవారం నాడు నల్లగొండ పట్టణంలో.. కాంగ్రెస్ చేపట్టిన 'నిరుద్యోగ నిరసన సభ' ను.. ఆ పార్టీలో రాజకీయ నిరుద్యోగ సభ అంటూ శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎద్దేవ చేశారు. తనపై భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన కామెంట్స్ కు ఘాటు కౌంటరిచ్చారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డివి మతిస్థిమితం లేని మాటలనీ సెటైర్లు వేశారు. ఉదయం బీఆర్ఎస్ కి వస్తా అని, మధ్యాహ్నం కాంగ్రెస్ లోనే ఉంటానని, సాయంత్రానికి బీజేపీ లో చేరతానని పొంతన లేని కామెంట్స్ చేయడం కోమటిరెడ్డి కి అలవాటనీ సుతిమెత్తని కౌంటరిచ్చారు. సొంతిల్లు లేదని ప్రగల్భాలు పలికే కోమటిరెడ్డ కి.., హైదరాబాద్ లో విల్లాలు, హైటెక్ సిటీ లోని ఆస్తులు, వందల కోట్లు ఎక్కడివని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. రాబోయే నాలుగైదు నెలలు ఇరిగేషన్ ప్రాజెక్టులు పనులు పూర్తి చేస్తామని ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ నేతృత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని గుత్తా ఆశ భావం వ్యక్తం చేశారు.

## యాదాద్రిలో భారీ వర్షం

**యాదాద్రి**

భారీవర్షంతో యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి పుణ్యక్షేత్రం సహ పరిసరాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొండ పైన టెంపుల్ పరిసర రోడ్లపై వరదనీరు పొంగి ప్రవహినీచింది. వీక్ ఎండ్ కావడంతో.. భక్తులు పెద్ద ఎత్తున దర్శనం కోసం ఆలయానికి వచ్చారు. తెలవారుతుండగానే భారీవర్షం కురవడంతో.. భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీవర్షంతో వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది.

## జీహెచ్ఎంసీ నిర్లక్ష్యానికి చిన్నారి బలి

**హైదరాబాద్**

పాల ప్యాకెట్ కోసమని బయటకు వెళ్లిన బాలిక మళ్లీ తల్లి ముఖం చూడలేదు. చిన్నారి మ్యాన్హోల్ మూత తెరచివుండటంతో డ్రైనేజీలో పడిపోయింది. సికింద్రాబాద్ పార్శిగ్ దగ్గర పాప మృతదేహం గుర్తించారు. మృతురాలు 4వ తరగతి చదువుతున్న మౌనికగా గుర్తించారు.

## ఎమ్మెల్యే రాజా సింగ్ క్లారిటీ

**హైదరాబాద్**

పార్టీ మార్పుపై ఎమ్మెల్యే రాజాసింగ్ క్లారిటీ ఇచ్చారు. టీడీపీ లోకి వెళ్తానన్న వార్తలో వాస్తవం లేదు. నాలాంటి వారిని ఎవరూ ఏ పార్టీ లోకి ఆహ్వానించరని అయన కుండ బద్దలు కొట్టారు. నా మెంటాలిటీ కి ఒక్క బీజేపీ మినహా ఏ పార్టీ సరిపోదు. బీజేపీ లో నాపై సస్పెన్షన్ ఎప్పుడు ఎత్తేస్తారో తెలియదు. బీజేపీ నేతలు నాతో మాట్లాడుతూనే ఉన్నారు... కేంద్ర మంత్రులు సైతం నాతో టచ్ లో ఉన్నారు. ధైర్యంగా ఉండమని చెబుతున్నారు. నేను బీజేపీ లోనే కొనసాగుతాను. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున గోషామహల్ నుంచే పోటీ చేస్తానని వెల్లడించారు.

## ఆటోమొబైల్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

**చిత్తూరు**

పలమనేరులో బిస్మిల్లా ఆటోమొబైల్స్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. దుండగులు కారులో వచ్చి కారు వెనుక భాగంతో దుకాణం షటర్న్ ఢీ కొట్టి పెట్రోల్ పోసి అంటించి పారిపోతున్న దృశ్యాన్ని స్థానికుడు గమనించాడు. ఈ ఘటనలో కారు వెనుక భాగం లో కూడా మంటలు వ్యాపించాయని చెబుతున్నాడు. మంటలు వ్యాపించిన కారుతో సహా సంఘటనా స్థలం నుంచి దుండగులు పారిపోయారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ను పరిశీలిస్తున్నారు. దుకాణంలోని పూర్తి సరుకు దగ్ధం అయింది. 20 లక్షల సరుకు, మూడు లక్షల నగదు అగ్నికి ఆహుతైదని సమాచారం.మంటలను గుర్తించి ఫైర్ సిబ్బందికి సమాచారం స్థానికులు అందించారు. మంటలను అదుపు లోకి వచ్చాయి. అగ్ని ప్రమాదం సహజంగా జరిగిందా లేదా ఉద్దేశపూర్వకంగా జరిగిందా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## వచ్చే నెల ఓయూలో భారీ జాబ్ మేళా

**హైదరాబాద్**

ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి సర్టిఫికెట్ లు పంపిణీ చేసారు. టైలరింగ్, బ్యూటీసీయన్ మగ్గం రంగాల్లో ఫౌంగేషన్ శిక్షణ అందించింది. సికింద్రబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పార్సిగుట్ట రాఘవ గార్డెన్ లో 1200 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్పేట్ ఎమ్మెల్యే గా ఉన్నప్పటి నుంచి గత పది పన్నెండు సంవత్సరాలుగా మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతున్నది. రాజకీయాలకతీతంగా సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ నైపుణ్య శిక్షణకు సంబంధించి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్మెంట్ తద్వారా ఉపాధిని పెంచుతున్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రధాని నరేంద్ర మోడీ దాదాపు 20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించారు. నైపుణ్య శిక్షణ పొందిన మహిళలకు యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. వచ్చేనెల 20 21 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ లో భారీ ఉద్యోగ మేళ నిర్వహించబోతున్నాము. నిరుద్యోగ యువతీ యువకులు ముందే రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్ మేళాలో పాల్గొనాలని అన్నారు.

# తమ్మినేని సీతారాంపై నకిలీ డిగ్రీ ఆరోపణలు

### డాక్యుమెంట్స్ రిలీజ్ చేసిన టీడీపీ

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారం డిగ్రీ చదివినట్లు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి పునరుద్ఘాటించారు. తాము సమాచార హక్కు చట్టం ప్రకారం సేకరించిన వివరాల మేరకు ఆయన బీకాం చదివినట్లు అందజేసిన సర్టిఫికెట్లు బోగస్ అని తేలిందని నర్సిరెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఈ మేరకు హైదరాబాద్‌లో డాక్యుమెంట్లు రిలీజ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రికార్డుల్లో తన పేరు లేకుండానే సర్టిఫికెట్లు ఎలా వచ్చాయో స్పీకర్ తమ్మినేని చెప్పాలని నర్సిరెడ్డి హైదరాబాద్‌లో డిమాండ్‌చేశారు. తమ్మినేని సీతారాం చదివినట్లు ప్రకటించుకున్న నాగర్‌కర్నూలు స్టడీ సెంటర్ రిజిస్టర్‌లో వివరాలు లేవు. ఆయన పేర్కొన్న హాల్‌టిక్కెట్టు కూడా వేరొకరి పేరుతో ఉంది. అలాంటప్పుడు ఆయన వద్ద ఉన్న సర్టిఫికెట్లు ఎవరు తయారు చేశారు? దీనిపై శాఖాపరంగా అధికారులు విచారణ జరపాలన్నారు. నకిలీ బాగోతంపై పోలీసులు దర్యాప్తు చేయాలని నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. నాగకర్నూలు స్టడీ సెంటర్‌లో 2015 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థుల వివరాలివ్వాలని అంబేద్కర్ యూనివర్శిటీ అధికారులను సమాచార హక్కు చట్టం కింద కోరాం. ఆ ఏడాది ఆ స్టడీ సెంటర్‌లో మొత్తం 839 విద్యార్థులు చదివారని పేర్కొంటూ ఆ విద్యార్థులు అందరి వివరాలను అంబేద్కర్ యూనివర్సిటీ మాకు అధికారికంగా ఇచ్చింది. ఆ విద్యార్థుల జాబితాలో తమ్మినేని సీతారాం పేరు లేదన్నారు. తమ్మినేని సీతారాం డిగ్రీ పాసైనట్లు ఆయన ఇచ్చిన సర్టిఫికెట్‌లో ఉన్న హాల్ టికెట్ నెంబర్(1791548430)ను డి.భగవంత్ రెడ్డి పేరుతో ఉంది. అలాగే, సమాచారహక్కు చట్టం కింద ఓయూ అధికారులు, తమ్మినేనికి సంబంధించి మాకిచ్చిన సర్టిఫికెట్‌లు నిజమైనవా? కావా? అన్నది పరిశీలించాలని అంబేద్కర్ యూనివర్శిటీ అధికారులను కోరాం. దానికి ఆ వివరాలు తమ రికార్డులతో సరిపోవడం లేదని అంబేద్కర్ యూనివర్శిటీఅధికారులు ధృవీకరించారు. దీన్నిబట్టి చూస్తే తమ్మినేని బీకాం డిగ్రీ సర్టిఫికెట్టు, ప్రొవిజినల్, మైగ్రేషన్, టీసీ అన్నీ కూడా నకిలీవే అని స్పష్టమవుతోందని నర్సిరెడ్డి స్పష్టం చేశారు. డిగ్రీ చదవకపోయినా చదివినట్లు దొంగ సర్టిఫికెట్‌తో అడ్మిషన్ పొందినందుకు ఆయనపై చర్య తీసుకోవాలని, ఆయన ఈ సర్టిఫికెట్లు ఎలా సంపాదించారో సమగ్ర దర్యాప్తు జరపాలని నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి తాము సమాచార హక్కు చట్టం కింద పొందిన సమాచారం ప్రతులను కూడా ఆయన విడుదల చేశారు.

# గుంటూరులో డ్రగ్స్ మాఫియా

**గుంటూరు:**

ఉగ్రవాద సంస్థలు తమ సభ్యులకు ఉత్ప్రేరకంగా వాడే మాదకద్రవ్యాలు మందులరూపంలో పల్నాడు నుంచి సప్లై అవుతున్నాయని పోలీసులు గుర్తించారు. ఈ ఉత్ప్రేరకం మందులను నర్సారావుపేట ప్రాంతంలో ఉన్న ఫార్మసీ కంపెనీలో తయారు చేస్తున్నట్లు నిర్ధారించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కేంద్రంగా భారీ ఎత్తున జరుగుతున్న ట్రెమడాల్ ట్యాబ్లెట్ల అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఇప్పటికే కొన్ని వందల కోట్లలో ట్యాబ్లెట్లను అక్రమ రవాణా చేసినట్లు గుర్తించారు. ఉగ్రవాద సంస్థలు ఐసీస్, ఆఫ్రికా ప్రాంతంలోని బోకోహరమ్ లాంటి సంస్థలు ఈ మందులను విరివిగా ఆర్డర్ చేస్తూ ఉంటాయి. ఈ ఉగ్రవాద సంస్థలు తమ సభ్యులు అలసిపోకుండా నిరాటంకంగా పనిచేసేందుకు.. విధ్వంసాలకు ఒడిగట్టేందుకు ఈ ట్రెమాడాల్ డ్రగ్ టాబ్లెట్ రూపంలో తీసుకుంటారు. నొప్పుల నివారణ కోసం సూక్ష్మ మోతాదులో వాడేందుకు కేంద్ర ప్రభుత్వం చాలా కఠినమైన ఆంక్షలతో ఈ కాంబినేషన్ తో టాబ్లెట్ తయారీకి అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కాంబినేషన్ లో మాత్రమే తయారు చేయవలసి ఉంటుంది. ట్రెమాడాల్ మాదక ద్రవ్యంగా ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ప్రభుత్వం ఆక్షలు పెట్టింది.ఈ మందు వాడటం వల్ల నాడీ వ్యవస్థపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతోంది. విపరీతంగా ఉత్పేరితం పొంది విధ్వంసకర కార్యకలాపాలకు పూనుకుని భయోత్పతాన్ని సృష్టించేందు పనిచేస్తోంది. గత ఫిబ్రవరిలో అనుమతుల్లేని రూ.21 కోట్ల విలువైన పది లక్షల ట్రెమడాల్ ట్యాబ్లెట్లను సూడాన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇప్పటి వరకు మూడున్నర కోట్ల ట్రెమడాల్ ట్యాబ్లెట్లను అక్రమ రవాణా చేసినట్లుగా విచారణలో గుర్తించిన ముంబై కస్టమ్స్ అధికారులు. ట్యాబ్లెట్లను ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న సేఫ్ ఫార్మా కంపెనీలో తయారైనట్లు నిర్ధారణ చేశారు. సేఫ్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ సనగల శ్రీధర్ రెడ్డిని అరెస్ట్ చేసిన ముంబయి కస్టమ్స్ అధికారులు విచారణ చేపట్టారు. 2019లో సేఫ్ ఫార్మా కంపెనీలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసిన శ్రీధర్ రెడ్డి, సేఫ్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ లుగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఇప్పటికే కొన్ని వందల కోట్ల రూపాయల ట్రెమడాల్ ట్యాబ్లెట్లను విదేశాలకు సరఫరా చేసినట్లుగా ముంబయి కస్టమ్స్ అధికారులు గుర్తించారు. కరోనా సమయంలో రెండు వందల కోట్ల విలువైన ట్యాబ్లెట్లను విదేశాలకు సేఫ్ ఫార్మా కంపెనీ సరఫరా చేసినట్లు సమాచారం. సేఫ్ పార్మా కంపెనీని పరిశీలించిన నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చదలవాడ అరవింద బాబు.. ఈ సందర్భంలో అరవిందబాబు మాట్లాడుతూ...మాదక ద్రవ్యాల తయారీకి పాల్పడిన నిందితులు నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అనుచరులేనని చదలవాడ అరవిందబాబు ఆరోపణ చేశారు. సేఫ్ ఫార్మా ఆగడాలపై సీబీఐ దర్యాప్తు చేయించాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చదలవాడ అరవింద బాబు డిమాండ్ చేశారు. గుంటూరును వైసీపీ నేతలు డ్రగ్స్ కు అడ్డాగా మార్చారని ఆరోపించారు. నిందితులకు కఠిన శిక్షలు వేయాలని, ఈ వ్యవహారంలో ఉన్న అందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# ఇక అందరికి అందుబాటులోకి బాస్

**హైదరాబాద్ :**



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పాటు ప్రగతి భవన్ నుంచే పాలన సాగించారు. ఆయన సచివాలయానికి వచ్చింది లేదు. ప్రగతి భవన్‌లోనే ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ఉండటంతో అక్కడే ఆయన ఉండేవారు. ప్రగతి భవన్‌లోకి ఎవరికీ ఎంట్రీ ఉండేది కాదు. ప్రగతి భవన్ నుంచి పిలుపు వస్తేనే ఎంట్రీ. లేకుంటే మంత్రులయినా సరే.. నో ఎంట్రీ. తొమ్మిదేళ్ల పాటు కేసీఆర్ పాలన ఇలాగే సాగింది. కానీ మే 1వ తేదీ నుంచి పూర్తిగా మారిపోయింది. కేసీఆర్ ఇక అందరికీ అందుబాటులోకి వస్తున్నారు. ఎమ్మెల్యేలు కలిసేందుకు కూడా సీఎం కేసీఆర్ కొంత సమయం ఇచ్చే అవకాశా లున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాదు గులాబీ పార్టీని రెండు సార్లు అధికారంలోకి తెచ్చిన ఘనత కూడా కేసీఆర్ దే. అందులో ఎవరికి ఏమాత్రం సందేహం లేదు. అయితే కేసీఆర్ నియోజకవర్గాల పర్యటనకు వచ్చినప్పుడు మాత్రమే ఆయన దర్శన భాగ్యం మంత్రులకు, ఎమ్మెల్యేలకు లభిస్తుంది. మంత్రులయితే కేబినెట్ సమావేశాల్లో కలుస్తున్నా అంత వరకే. ఆ అజెండా వరకే. తమ నియోజకవర్గం, జిల్లా సమస్యల గురించి మాట్లాడేందుకు వీలు లేదు. ప్రగతి భవన్‌లో తమ సమస్యలపై కలవాలనుకునే వారికి గగనమే. గగనమే అనే కన్నా అది అసాధ్యమని చెప్పాలి. అయితే అక్కడి నుంచి పిలుపు వస్తేనే ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో, ఉప ఎన్నికలు జరిగినప్పుడు మాత్రమే ఎమ్మెల్యేలయినా, మంత్రులయినా కేసీఆర్ ను దర్శించుకునే వీలుంది. కానీ ఏప్రిల్ 30వ తేదీ నుంచి కొత్త సచివాలయం ప్రారంభం కానుంది. ఈ సచివాలయంలోని ఆరో అంతస్థులో కేసీఆర్ తన ఛాంబర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సచివాలయం లోపలికి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లే అవకాశాలు సులువుగా ఉంటాయి. ఇక కేసీఆర్ మూడ్ చూసుకుని ఆయనతో ముచ్చటించడానికి టైం కోరితే లక్... పిలిచినా పిలవొచ్చు. ఆయన ఖాళీగా ఉంటే పిలుస్తారు. లేదంటే మరో తేదీ ఇచ్చే అవకాశాలున్నాయి. గతంలో సచివాయం నుంచి పనిచేసిన ముఖ్యమంత్రులు అందరూ ఇదే విధానాన్ని పాటించే వారు. ఎమ్మెల్యేలకు కొంత సమయం కేటాయించే వారు. వారు వచ్చి తమ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి నుంచి త్వరగా నిధులు తెచ్చుకునే వీలుండేది. కానీ తొమ్మిదేళ్ల నుంచి ఎమ్మెల్యేలకు ప్రగతి భవన్‌లో ప్రవేశం లేదు. అందులోకి ఎంట్రీ అంటే మామూలు విషయం కాదు. కుదిరే పని కాదని కేటీఆర్ ను కలసి తమ సమస్యల గురించి చెప్పుకునే వారు. కానీ మే 1వ తేదీ నుంచి గులాబీ బాస్ అందరి వాడులా మారబోతున్నాడు. ఆయన అందరికీ అందుబాటులో ఉండనున్నారు. సెక్రటేరియట్‌లో కేసీఆర్ ఉన్నంత సేపు ఆయన పిలుపు కోసం ఎదురు చూసేందుకు ఎమ్మెల్యేలకు ఇక చక్కని అవకాశమంటున్నారు. అందుకే కొత్త సెక్రటేరియట్ ప్రారంభ ˘మవు తుందంటే ముందుగా ఎగిరి గంతేస్తుంది ఎమ్మెల్యేలే. సో.. ఇక కేసీఆర్ ఆరో అంతస్థులో అందరికీ అందుబాటులో ఉంటారన్న విషయం గులాబీ పార్టీ నేతల్లో హుషారు నింపుతుంది. మరి కేసీఆర్ వారికి ఎంత మేర సమయం కేటాయి స్తారన్నది చూడాల్సి ఉంది.

## నర్మెట్టలో భట్టి పాదయాత్ర

**జనగామ**

జనగామ జిల్లా నర్మేట మండలంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రల కొనసాగింది. హన్మంతాపూర్ ఐకేపి సెంటర్ లో వర్షానికి తడిసిన ఒడ్లను అయన పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయామని రైతులు అవేదన వ్యక్తం చేసారు. పంట నష్ట పరిహారం ప్రభుత్వం ఇచ్చే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని భట్టి హామీ ఇచ్చారు. అయన వెంట మాజీ పీపీసీ ఛీఫ్ పొన్నాల లక్ష్మయ్య, తదితరులు వున్నారు

## నారాయణపురంలో దెబ్బతిన్న పంటలు

**నల్గొండ**

సంస్థాన్ నారాయణపురం మండలం వ్యాప్తంగా రాత్రి కురిచిన అకాల వర్షానికి వడగండ్లు ఈదురుగాలతో వర్షం పడడం తో పంటలు పూర్తిగా నాశనమైయాయి. పెద్ద పెద్ద భారీ క్షాలు ఈదురుగాలులకు రోడ్డుపై పడడంతో రాకపోకులకు ఆటంకంగా మారింది. రైతులు ఇప్పటివరకు ఏ అధికారి కూడా వచ్చి తమ పంట నష్టం గురించి వివరణ తెలుసుకోలేదని అంటున్నారు. చేతికి వచ్చిన పంట కళ్ళముందే నాశనం కావడంతో తమ గోడు ఎవరికి చెప్పాలో అర్థ కావడం లేదని బాధపడుతున్నారు. అకాల వర్షాలు మాకు కన్నీరు మిగిల్చిందని తెలుపుతున్నారు.

## ఫిలిపైన్స్ మృతిచెందిన విద్యార్ధికి అంత్యక్రియలు

**యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం రామలింగారెడ్డి పల్లిలో ఫిలిఫ:న్స్ మరణించిన వైద్య విద్యార్థి గూడూరు మణికాంత్ రెడ్డి అత్యక్రియలు శోక సముద్రం మధ్య ముగిశాయి. ఫిలి ఫైన్స్ లో వైద్యవిద్యనభ్యసించడానికి వెళ్లి ఈనెల 23న అనుమానాస్పదంగా మరణించారు. ఫిలిప్పైన్స్ నుంచి స్వస్థలానికి మృతదేహం శనివారం తెల్లవారుజామున చేరుకుంది. స్వగ్రామం రామలింగంపల్లిలో అంత్యక్రియలు ముగిసాయి. ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రయోజకుడిగా తిరిగి వస్తాడు అనుకున్న కొడుకు మృతి చెంది రావడంతో తల్లిదండ్రుల శోకాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు. స్వస్థలానికి మృతదేహాన్ని రప్పించడానికి సహకరించిన బిజెపి నాయకులు గూడూరు నారాయణ రెడ్డి, మంత్రి కేటీఆర్ కు మృతుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడిల అందోళన

**కాకినాడ**

అంగన్వాడీలకు పెండింగ్ ఉన్న రెండు నెలల వేతనాన్ని తక్షణమే చెల్లించాలని, ప్రమోషన్ల విషయంలో రాజకీయ జోక్యాన్ని నివారించి అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని, అంగన్వాడీ యూనియన్ అంతర్గత విషయాల్లో అధికారులు జోక్యాన్ని మానుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అంగన్వాడీలకు రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో కాకినాడ స్త్రీ శిశు సంక్షేమశాఖ (ఎఅఆూ ఆఫీస్) జిల్లా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ పిడి ప్రవీణ శిబిరానికి విచ్చేసి వినతిపత్రం స్వీకరించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దడాల పద్మ, ఎరుబండి చంద్రావతి, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కలు రాజ్ కుమార్ లు మాట్లాడుతూ, అంగన్వాడి యూనియన్ లో ఎవరు నాయకులుగా ఉండాలో అంగన్వాడీ కార్యకర్తలు తేల్చుకుంటారని, ఇందులో అధికారుల ప్రమేయాన్ని సహించే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ట్రేడ్ యూనియన్ చట్ట ప్రకారం ఎన్నుకున్న నాయకత్వంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలు నిరాకరిస్తే అది చట్ట వ్యతిరేకం అవుతుందని తెలియజేశారు. బహుశా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరిని జిల్లా అదుకారులు అనుకరిస్తేగనుక తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నెలల తరబడి వేతనాలను పెండింగ్లో పెడితే చిరుద్యోగులైన అంగన్వాడీలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు.

## ఆసుపత్రిలో రోగిపై లైంగిక దాడి

**విజయవాడ**

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అవమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా రోగిపై చంద్రశేఖర్ అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించడం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం అర్ధరాత్రి మచిలీపట్నానికి చెందిన నాగలక్ష్మి(25) అనే మహిళా రోగిపై చంద్రశేఖర్ అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. ఈ క్రమంలో అంబులెన్స్ డ్రైవర్ అతడ్ని అడ్డుకున్నాడు. అనంతరం మహిళ తరపున బంధు,మిత్రులు నిందితుడిపై మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు చంద్రశేఖర్‌ని అదుపులోకి తీసుకున్నారు. 354 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ప్రస్తుతం బాధిత మహిళ నాగలక్ష్మిపై వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు

## భువనగిరిలో రైతుల అందోళన

**యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ వర్షం భువనగిరి మార్కెట్ యార్డ్ లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధృతి పెరగడం కారణంగా వర్షం నీటిలో వరి ధాన్యం మూడుసార్లు కొట్టుకపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు

ప్రజా తపన prajathapana.com

# కుప్పంలో మారుతున్న స్ట్రాటజీలు

**తిరుపతి :**

కుప్పంలో టీడీపీ కొత్త స్ట్రాటజీని ఫాలో అవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యంగా వ్యూహం పన్నుతోంది. 38 మందితో కమిటీ ని నియమించింది. శాసనమండలి ఎన్నికల్లో సత్తా చాటిన కొత్త ఎమ్మెల్సీకి కమిటీ బాధ్యతలను అప్పగించింది. టీడీపీ హై కమాండ్ తీసుకున్న కీలక నిర్ణయం పెద్ద చర్చకు దారితీసింది. వై నాట్ 175. ఇది వైసిపి స్ట్రాటజీ. ఏపీలోని అన్ని సీట్లలో గెలుస్తామన్న ధీమాతో కుప్పంలోనే ఈ స్లోగన్ తెరమీదికి వచ్చింది. గోడలపైకి టార్గెట్ ను తీసుకొచ్చింది. ఏడాదిన్నర క్రితం వైసీపీ అధినేత జగన్ సీఎం హోదాలో కుప్పం లో అడుగుపెట్టిన రోజు ఈ నినాదం పొలిటికల్ గా దద్దరిల్లింది. కుప్పం గోడలపై వైనాట్ 175 టార్గెట్ అందరినీ ఆకట్టుకునేలా చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో వైసీపీ నినాదం టిడిపిని ఉలిక్కిపడేలా చేసింది. కొత్త ఆలోచనకు అవకాశం కల్పించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు మెజారిటీ గణనీయంగా తగ్గడం, ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థలు ఎన్నికల్లో వైసీపీ దూకుడు ప్రదర్శించడంతో టీడీపీలో కలవరం మొదలైంది. మంత్రి పెద్దిరెడ్డి కుప్పం టార్గెట్ గానే పొలిటికల్ స్టెప్స్ వేయడంతో కుప్పంపై టీడీపీ హై కమాండ్ మరింతగా ఫోకస్ చేసింది. ప్రతి 3 నెలలకు ఒకసారి చంద్రబాబు స్థానిక ఎమ్మెల్యే గా కుప్పం పర్యటనకు రావడమే కాకుండా కుప్పంలో సొంతింటి నిర్మాణానికి శ్రీకారం చుట్టాల్సి వచ్చింది. శరవేగంగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసే పనిలో నిమగ్నం చేసింది.కాగా 2024 ఎన్నికల్లో కొత్త స్ట్రాటజీని ఫాలో అయ్యేలా ప్లాన్ చేసింది. కుప్పంలోని 4 మండలాల్లో ప్రస్తుతం ఒక్కో లీడర్ పెత్తనం కొనసాగుతుండగా ఇందుకు భిన్నంగా ఎన్నికల కమిటీ తెరమీదకి తెచ్చింది. స్థానిక నాయకత్వంపై గత కొంతకాలంగా కేడర్ లో ఉన్న అపనమ్మకం, వ్యతిరేకతకు చెక్ పెట్టాలని భావిస్తున్న హై కమాండ్ కేడర్ లో ఉన్న కన్ఫ్యూజన్ పార్టీకి నష్టం జరుగుతుందని భావించింది. ఇప్పటివరకు ఉన్న ఆ నలుగురు ముఖ్య నేతలే కుప్పం టీడీపీకి దిక్కు కావడంతో పార్టీ లీడర్లపై కేడర్ చేస్తున్న ఫిర్యాదులు చంద్రబాబుకు సైతం ఇబ్బందిని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ద్వితీయ శ్రేణి టిడిపి కేడర్ ను వైసిపి అట్రాక్ట్ చేసింది. పట్టు సడలుతున్న పార్టీ పరిస్థితిని గుర్తించిన పార్టీ హై కమాండ్ 2024 ఎన్నికలకు వ్యూహం మార్చా లనుకుంది. మొదటికే మోసం రాకుండా జాగ్రత్త పడింది. ఇందులో భాగంగానే లక్ష ఓట్ల మెజారిటీని టార్గెట్ గా చేసుకుంది. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు రికార్డు మెజారిటీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటిదాకా కుప్పం రాజకీయాన్ని నడిపించిన పాతతరం నేతల్ని పక్కనపెట్టి యువ నాయకత్వాన్ని ఎంకరేజ్ చేయాలని నిర్ణయించింది. ఒకరిద్దరు నేతల పెత్తనానికి ఇకపై చాన్స్ లేకుండా చేసింది. ఏకంగా 38 మందితో ఎన్నికల కమిటీ వేసింది. కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీనే లక్ష్యంగా వ్యూహం పన్నిన టిడిపి హై కమాండ్ కుప్పం టీడీపీ వ్యవహారాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కు అప్పగించింది.ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా గెలిచిన కంచర్ల శ్రీకాంత్ ను 38 మంది పార్టీ సభ్యులతో ఏర్పాటైన కుప్పం నియోజకవర్గ ఎన్నికల కమిటీకి చైర్మన్ ను చేసింది. . వారంలో 3 రోజులపాటు కుప్పం లోనే కంచర్ల శ్రీకాంత్ మకాం ఉండేలా ప్లాన్ చేసింది. గత శాసనమండలి ఎన్నికల్లో సత్తా చాటిన శ్రీకాంత్ కు కుప్పం బాధ్యతలను అప్పగించడం వెనుక వ్యూహం ఏమిటన్న చర్చ నడుస్తుండగా వైసీపీ టీడీపీ ఎత్తుగడను అబ్జర్వ్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల తరహాలోనే చంద్రబాబుకు చెక్ చెప్పాలన్న కసరత్తు మంత్రి పెద్దిరెడ్డి డైరెక్షన్ లో జరుగుతుండగా లక్ష ఓట్ల టీడీపీ టార్గెట్ వైసీపీ లోనూ చర్చకు తెరలేపింది.

# రెండు ఎమ్మెల్సీలు- 20 మంది ఆశవహులు

**హైదరాబాద్ :**

తెలంగాణలో రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై గులాబీ అధిష్టానం తీవ్రంగా వడపోత మొదలు పెట్టింది. శాసనమండలిలో మే 27న గవర్నర్ కోటాలో రెండు ఎమ్మె ల్సీ స్థానాలు ఖాళీ అవుతాయి. క్రిస్టియన్ మైనార్టీ నుంచి డి. రాజేశ్వర్ రావు, ముస్లిం మైనార్టీ నుంచి ఫారూఖ్ హుస్సేన్ పదవి కాలం ముగుస్తోంది. మూడు సార్లు ఎమ్మెల్సీగా పని చేశారు. వీరిద్దరిలో ఎవరికైనా మళ్లీ చాన్స్ ఇస్తారా లేదా అన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గవర్నర్ కోటా కావడంతో .. మరింత జాగ్రత్తగా అభ్యర్థుల్ని కేసీఆర్ ఎంపిక చేయాల్సి ఉంది. కేసులు ఉంటే గవర్నర్ తిప్పి పంపే అవకాశం ఉంది. హుజూరాబాద్ ఎన్నికల తర్వాత గవర్నర్ కోటాలో తెలంగాణ కేబినెట్ పాడి కౌశిక్‌ను సిఫార్సు చేసింది. ఆ ఫైల్‌ను గవర్నర్ తమిళ సై మూడు నెలల పాటు పెండింగ్‌లోనే పెట్టారు. తర్వాత వెనక్కి పంపారు. బీఆర్ఎస్ అధినేత పరిశీలనలో చాలా మంది పేర్లు ఉన్నాయి. అందులో ప్రధానంగా కొందరి పేర్లు వడపోతలో భాగంగా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. విద్యా వేత్తలకు ఇస్తే అందులో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, పీఎల్ శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరు ముగ్గురు పేర్లు వినిపి స్తున్నాయి. బీసీ కోటలో దాసోజు శ్రవణ్, బూడిద బిక్షమయ్య గౌడ్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోం ది. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ కోటాలో విద్యార్థి నేతలకు అవ కాశం కల్పించలేదు. అయితే ఎన్నికలు దగ్గర పడుతుండ టంతో వీరికి ఒక్క స్థానం కేటాయించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో పార్టీకి చేసిన సేవలకు గతంలో సీఎం కేసీఆర్ రెండు మూడు స్థానాల్లో పోటీ చేయాలని ఘంటా చక్రపాణిని అడిగారు. అప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో ఆసక్తి లేదని తెలపడంతో టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా నియమించారు. పదవి ముగిసిన తర్వాత ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ఎమ్మెల్సీ పదవి కాలం ముగుస్తోంది కాబట్టి.. ఆ వర్గాల నుంచి వారికి చాన్సివ్వాల్సి ఉంది. ప్రస్తుతం రాజేశ్వరరావు క్రిస్టియన్ మైనార్టీ, ఫారూఖ్? హుస్సేన్ ముస్లిం మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్నారు. తనకు మరో మారు రెన్యూవల్ చేయాలని రాజేశ్వరరావు కోరుతున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రాజేశ్వర్ రావు వరుసగా మూడో సారి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. జీహెచ్ఎంసీకి మాజీ కో ఆప్షన్ సభ్యురాలు విద్యావర్ధని కూడా క్రిస్టియన్ సామాజికవర్గం నుంచి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఇదే కోటాలో ఎమ్మెల్సీ కవిత అనుచరుడు, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ పేరు కూడావినిపిస్తోంది. మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కూడా వచ్చే నెలలో రిటైర్ కానున్నారు. ఫారూఖ్ హుస్సేన్ మరోమారు రెన్యూవల్ చేయాలని అధినేతను కోరినట్టు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు ఎంకే ముజీబుద్దీన్ మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు.గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇటీవలే బీజేపీ నుంచి టీఆర్ఎస్ లో చేరిన శ్రవణ్? దాసోజు, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో పార్టీలో టిక్కెట్ల కోసం పోటీ కారణంగా తుమ్మల నాగేశ్వర్ రావుకు అవకాశం కల్పిస్తారనే చర్చ కూడా ఉంది. పాలేరు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకే టిక్కెట్ ఖరారు చేసే అవకాశం ఉంది. తుమ్మలను ఎమ్మెల్సీగా నామినేట్ చేయడం ద్వారా ఎలాంటి ఇబ్బంది ఉండదని అధినేత భావిస్తున్నారని అంటున్నారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన వారెవరూ అసెంబ్లీలో, మండలిలో లేరు.. నిజామాబాద్ జిల్లాకు చెందిన వీజీగౌడ్ ఇటీవలే ఎమ్మెల్సీగా రిటైర్ అయ్యారు. గౌడ్ ఈక్వేషన్ ను పరిగణనలోకి తీసుకుంటే మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ లో ఎవరో ఒకరికి అవకాశం దక్కుతుంది. మరో ఆరు నెలల్లో ఎన్నికలు ఉన్నందున పొలిటికల్ ఈక్వేషన్లు, సర్దుబాట్లను పరిగణనలోకి తీసుకొన్న మీదటే సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

# బీజేపీ నుంచే పోటీ - రాజాసింగ్ క్లారిటీ

**హైదరాబాద్**



తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానంటూ వస్తున్న వార్తలను గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఖండించారు. తాను ఎట్టి పరిస్థితిలో టిడిపి పార్టీలో చేరే లేదని స్పష్టంచేశారు .తాను బిజెపి పార్టీలో ఉంటానని రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీ నుంచే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరో సారి పోటీ చేస్తానన్నారు. నా మెంటాలిటీ కి బీజేపీ తప్ప ఏ పార్టీ లు షూట్ కావు? ఎవరు తీసుకోరంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీలోకి వెళ్ళలనే ఆలోచన లేదని స్పష్టం చేశారు. నా మీద సస్పెన్షన్ ఎప్పుడు ఎత్తేస్తారో తెలియదన్నారు. బండి సంజయ్, కేంద్ర మంత్రులు ,బీజేపీ నేతలు తన వెనుక ఉన్నారని రాజాసింగ్ తెలిపారు. అయితే ఆయనపై బీజేపీ సస్పెన్షన్ వేటు వేసి ఆరు నెలలు దాటిపోయింది. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా సస్పెన్షన్ వేటు ఎత్తి వేయడం లేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మరోసారి పోటీ చేయాలంటే... సస్పెన్షన్ వేటువేసినందున బీజేపీ టిక్కెట్ ఇవ్వదని అనుకుంటున్నారు. అందుకే ఆయన పార్టీ మారుతారన్న ప్రచారం ఊపందుకుంది. రాజాసింగ్ 2009లో తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మహానగర పాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి 2009 నుంచి 2014 వరకు కార్పొరేటర్‌గా పనిచేశారు. అనంతరం బీజేపీలో చేరి 2014లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గోషామహల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ముఖేష్‌గౌడ్‌పై 46,793 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారతీయ జనతా పార్టీ నుంచి పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి ప్రేమ్‌సింగ్ రాథోడ్‌పై 17,734 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఓ స్టాండప్ కమెడియన్ హైదరాబాద్ షోను భారీ భద్రత మధ్య ఏర్పాటు చేసినందుకు నిరసనగా రాజాసింగ్ ఓ వివాదాస్పద వీడియో అప్ లోడ్ చేశారు. ఆ వీడియో తీవ్రదుమారం రేపింది. రాజాసింగ్ ను బీజేపీ నుండి సస్పెండ్ చేశారు. ఆగస్టు 25న రాజాసింగ్‌పై పీడీయాక్ట్ నమోదు చేశారు. దీంతో చాలా కాలం జైల్లో ఉండి బయటకు వచ్చారు. బయటకు వచ్చిన తర్వాత ఆయన బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. తనపై వచ్చిన వివాదాలు.. కేసుల విషయంలో పార్టీ హైకమాండ్‌కు వివరణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తి వేస్తారని చెబుతూ వస్తున్నారు కానీ ఎత్తి వేయడం లేదు. దీంతో ఆయన పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. ఇటీవల తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలు పెంచింది. టీ టీడీపీ అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ నియమాకం తర్వాత పలువురు నేతల్ని చేర్చుకుంటున్నారు. ఈ క్రమంలో రాజాసింగ్ కూడా కాసాని జ్ఞానేశ్వర్‌ను వ్యక్తిగతంగా కలిసి చర్చలు జరిపినట్లుగా ప్రచారం ఊపందుకుంది. టీడీపీలో చేరిన తర్వాత గోషామహల్ నియోజకవర్గంతోపాటు మరో మూడు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు తన పూర్తి సహకారం అందిస్తానని రాజాసింగ్ పార్టీ అధినేతలకు హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పుడు బీజేపీ తరపునే పోటీ చేస్తానని రాజాసింగ్ చెబుతున్నారు. కానీ సస్పెన్షన్ లో ఉన్న రాజాసింగ్ కు బీజేపీ టిక్కెట్ ఎలా కేటాయిస్తుందన్న ప్రశ్న రాజకీయవర్గాలు వేస్తున్నాయి. అయితే రాజాసింగ్ లాంటి నాయకుడ్ని బీజేపీ వదులుకోదని రేపోమాపో సస్పెన్షన్ ఎత్తి వేస్తారని చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**శనివారం తెల్లవారుజామున భారీ వర్షం**

**జలమయమైన రోడ్లు**

**రెండురోజులపాటు వర్ష సూచన**

**హైదరాబాద్,**



హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం వర్షం దంచికొట్టింది. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, హిమాయత్నగర్, నారాయణగూడ, ఫిలింనగర్, ఏఎస్ రావు నగర్, కుషాయిగూడ, నాగారం, కీసర, ఈసీఐఎల్ క్రాస్రోడ్స్, చర్లపల్లి, నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్ట్యాంక్ సహా పలు ప్రాంతాల్లో శనవారంతెల్లవారు జామున ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.నగరంలో మరో రెండు గంటలపాటు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలంటూ హైదరాబాద్ వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. కాగా ఏపీ, తెలంగాణల్లో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. విదర్భ నుంచి ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, తెలంగాణలోనూ ఓ మోస్తరు వానలు కురుస్తాయని వెల్లడించింది.

# మత్స్యకారులకు మద్దతుగా జనసేన సభ

**కాకినాడ**

కాకినాడ ఏటిమొగ ప్రాంతంలో ఉన్న మత్స్యశాఖ కార్యాలయం ఎదుట జనసేన పార్టీ ఆధ్వర్యంలో మత్స్యకారుల బాసటగా జనసేన భారీ సభను నిర్వహించింది. ఈ సభకు జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వేట విరామ సమయంలో ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి పదివేల రూపాయలు పరిహారంగా ఇస్తుందని అది సరిపోదని, అలాగే అర్హులైన వారికి అనేక నిబంధనలు పెట్టి చాలా మందిని తొలగిస్తోందన్నారు. సముద్రంలో వేటకు వెళ్ళిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే అతను మృతదేహం దొరికితేనే పరిహారం ఇస్తామని సూచించే నిబంధన తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. మత్స్యకారులకు మేలు చేసేలా జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మత్స్యకారులఐజ ప్రభుత్వం తప్పుడు లెక్కలను చెబుతోందని దాన్ని సరి చేయాలన్నారు. కాకినాడ కుంభాభిషేకం రేవులో సముద్రం పై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని దీన్ని అడ్డుకుంటామని మనోహర్ భరోసా కల్పించారు. సీఎం జగన్ అవగాహన లేని విధానాల వల్ల అన్ని వృత్తుల వారు అనేక రకాల ఇబ్బందులు గురవుతున్నారని ఆయన చెప్పారు. అంతకుముందు జనసేన పార్టీ మత్స్యకార విభాగం అధ్యక్షుడు బొమ్మిడి నాయకర్ జనసేన ఆశయాలను, అధినేత పవన్ కళ్యాణ్ విధానాలను వివరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని మత్స్యశాఖ జేడి కార్యాలయంలో అందించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ముత్తా శశిధర్, పంతం నానాజీ, కందుల దుర్గేష్, తుమ్మల బాబు, మాకినీడి శేషకుమారి, వరుపుల తమ్మయ్య బాబు, వేగుళ్ల లీలా కృష్ణ, సంగిశెట్టి అశోక్, కదలి ఈశ్వరి, సుంకర కృష్ణవేణి, బొంతు రాజేశ్వరరావు, డిఎంఆర్ శేఖర్, టీవీ రామారావు, పోలిశెట్టి చంద్రశేఖర్, రెడ్డి అప్పలనాయుడు, పితాని బాలకృష్ణ ,బద్దిరెడ్డి రాము, శెట్టిబత్తుల రాజబాబు, పాఠంశెట్టి సూర్యచంద్ర, బండారు శ్రీనివాస్, అత్తి సత్యనారాయణ, మేకా విశ్వనాథ్, తుమ్మల చందు, తదితరులు పాల్గొన్నారు

# జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలుగు వెలుగులు

**హైదరాబాద్**

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్-2023 సెషన్-2 ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తా చాటారు. జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన మలై కేడియా టాపర్‌గా నిలిచాడు. అలాగే హైదరాబాద్ విద్యార్థి సింగారపు వెంకట్ కౌండిన్య మొదటి ర్యాంక్ సాధించాడు. 300/300 మార్కులు స్కోర్ సాధిచాడు. కౌండిన్య పాఠశాల విద్య నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య విద్యా సంస్థల్లో చదివాడు. జూన్ 4న జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుతానని కౌండిన్య తెలిపాడు.జేఈఈ మెయిన్ ఫలితాల్లో నెల్లూరుకు చెందిన పి.లోహిత్ ఆదిత్యసాయి 2వ ర్యాంకు సాధించాడు. లోహిత్.. పాఠశాల విద్య నుంచి ఇంటర్ వరకు నెల్లూరులోని నారాయణ విద్యా సంస్థల్లో చదివాడు. జూన్ 4న జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతానని లోహిత్ తెలిపాడు. లోహిత్ కుటుంబం నెల్లూరులోని లక్ష్మీపురంలో నివాసముంటోంది. తండ్రి శ్రీనివాసరావు సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి వరలక్ష్మి గృహిణి. ఇక హైదరాబాద్‌కు చెందిన మరో విద్యార్థి సాయి దుర్గారెడ్డి 6వ ర్యాంకు, అమలాపురానికి చెందిన కే.సాయినాథ్ శ్రీమంత 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఆన్సర్ కీ సమయంలోనే కౌండిన్య, లోహిత్ 300/300 మార్కులు పొందిన సంగతి తెలిసిందే. మొదటి 10 ర్యాంకుల్లో నిలిచే అవకాశముందని నిపుణులు అంచనా వేయగా.. కౌండిన్య మొదటి ర్యాంకు, లోహిత్ 2వ ర్యాంకులో నిలిచారు.

# వడగండ్ల వానలతో వరి పంటలకు నష్టం

**హైదరాబాద్**

తెలంగాణలో అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వరి పంటలకు నష్టం వాటిల్లింది. పలు ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడిసిపోయింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసి చేతికంది వచ్చిన వరిపంట నేలపాలైంది. ఎంతో శ్రమించి పంట రక్షణ కోసం పడ్డ కష్టమంతా గాలివాన, వడగండ్ల మూలంగా నేలపాలైందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అకాల వర్షాలు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పడి రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి.చేతికొచ్చిన ధాన్యం, మొక్కజొన్న నీటి పాలైంది. వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట పట్టణాల్లోని మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దైంది. ప్రస్తుతం వాతావరణం మబ్బులు పట్టి ఉంది. మళ్లీ వర్షం పడే అవకాశం ఉండడంతో రైతన్న భయపడిపోతున్నాడు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్లనే తాము నష్టపోయామంటున్నారు రైతులు. మరింత సమాచారాన్ని మా ప్రతినిధి సమి అందిస్తారు.మామిడి రైతుల తోటల్లోని మామిడి కాయలు నేలరాలడంతో తీవ్రంగా నష్ట పోయారు. రైతులు తమ ధాన్యాన్ని చూస్తూ రోదిస్తున్నారు. కొన్ని గ్రామాలలోని వరికోయకుండానే పంటచేలోని వరిధాన్యం రాళ్లవానకు పూర్తిగా నేలమట్టమయ్యింది. దీంతో చేతికి వచ్చిన పంట కిలో కూడా చేతికి రాని పరిస్థితికి ఉందని రైతులు కంటతడి పెడుతున్నారు. అకాల వర్షాలతో పాటు, వడగండ్లకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.మరోవైపు ఇంకో రెండు రోజులు తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. ఉపరితల ఆవర్తనం విదర్భ నుంచి కొనసాగుతుంది. ఈ ప్రభావంతో తెలంగాణలో పలుచోట్ల మోస్తరు వర్షాలు పడతాయని సూచించింది. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. అటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది

## భారత్ గౌరవ్ ట్రైన్ ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో 3వ భారత్ గౌరవ్ ట్రైన్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గంగా పుష్కరాలకు 70 శాతం మంది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే వెళ్తారు. ఈ రోజు బయలుదేరిన భారత్ గౌరవ్ రైలు కోణార్క సూర్యదేవాలయం, పూరీ, కాశీ, అయోధ్య మొదలైన పుణ్యక్షేత్రాల మీదుగా భక్తులను తీసుకెళ్లి మే 7న తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ మార్గంలోని వివిధ పుణ్యక్షేత్రాలలో ప్రయాణీకులను క్షేమంగా తీసుకెళ్లి అక్కడ స్థానికంగా అవసరమయ్యే రవాణా, భోజన, వసతి సౌకర్యాలన్నీ భారతీయ రైల్వేనే ఏర్పాటు చేస్తుంది. వృద్ధులు, మహిళలు, పిల్లలను వెంటేసుకుని ఈ పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లాలంటే ప్రజలకు భారీ ఖర్చు, ప్రయాసలతో కూడుకున్న పని కాబట్టి మోదీ ప్రభుత్వం ఈ సర్క్యూట్ ల ద్వారా ఈ రైళ్లకు శ్రీకారం చుట్టిందని అన్నారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు

**విశాఖపట్నం**

అధాని డేటా సెంటర్ కు ప్రభుత్వం కేటాయించిన విశాఖ రుషికొండ హిల్ నంబర్ 4లో జరుగుతున్న పనులను టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పరిశీలించారు.వీరితో పాటు ఐటీ శాఖ మంత్రి అమర్నాథ్, భీమిలి ఎమ్మెల్యే అవంతి, కలెక్టర్ మల్లికార్జున్, సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కలసి సందర్శించిన ఆయన మాట్లాడుతూ ... ఉత్తరాంధ్ర అభివృద్ధి లో భాగంగా 3న విశాఖలో సిఎం జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.బోగాపురం ఎయిర్ పోర్ట్,విశాఖ టెక్ పార్క్ పేరిట 134 ఎకరాలు డేటా సెంటర్ కు జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.ఈ డేటా సెంటర్ ద్వారా 39 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లబిస్తాయని తెలిపారు.

## జంతువుల ఆరోగ్యానికి నిరంతర కృషి

**కాకినాడ**

జంతువులు సురక్షితంగా ఉండడానికి పశు వైద్యులు నిరంతరం కృషి చేస్తారని ఆ వైద్య నిపుణులు డాక్టర్ తలాటం సురేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వన్యప్రాణులు, మనుషుల మనుగడ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని అన్నారు. జబ్బు పడిన లేదా గాయపడిన జంతువులను పశు వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారని సురేష్ తెలిపారు. దంత వైద్యంలో జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మాట్లాడ లేని జంతువులకు పశు వైద్యులు వాటికి వైద్య చికిత్స చేసి రక్షణ కల్పిస్తున్నారని అన్నారు. ముందుగానే టీకాలు వేయడం ద్వారా మనల్ని సురక్షితంగా ఉంచుతున్నారని అన్నారు. ఇటీవల చత్తీస్గడ్ రాష్ట్రంలో జరిగిన 19వ ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్మెంట్ ఆఫ్ కవైస్ ప్రాక్టీస్ మహాసభలో డాక్టర్ సురేష్ జాతీయ స్థాయి ఉత్తమ సర్జన్ గా పురస్కారం అందుకోవడం అభినందనీయమని డాక్టర్ అడ్డాల తెలిపారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ తలాటం సురేష్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఎస్. శ్రీ నగేష్, పార్థసారథి ,రాజా ,అడబాల సత్యనారాయణ, , రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లరేవులో భారీ అగ్ని ప్రమాదం

**కాకినాడ**

ఏపీలోని కాకినాడ తాళ్ళరేవులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఫైబర్ బోట్ల తయారీ కంపెనీలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 40 బోట్లకి పైగా దగ్ధం కావడంతో భారీగాఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మంటలు భారీగా ఎగసి పడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి మంటలను ఆర్పుతున్నారు. ఉవ్వెత్తున మంటలు ఎగసి పడుతుంటంతో మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏటీఎం సెంటర్ లో అగ్నిప్రమాదం

**నెల్లూరు**

నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్లో ఉన్న ఎస్బీఐ ఏటీఎం సెంటర్ లో అగ్ని ప్రమాదం సంభవించింది. భారీగా మంటలు తో పాటు దట్టమైన పొగ వెలువడింది. ఏటీఎం రూమ్ లో అగ్ని ప్రమాదం ఎలా సంభవించింది అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ అగ్ని ప్రమాదం లో ఏటీఎం మిషన్ లోని నగదు పూర్తిగా కాలిపోయే అవకాశం ఉంది కావున ఈ అగ్ని ప్రమాదం వల్ల ఎంత నష్టం జరిగింది అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది

## ఎక్స్ ప్రెస్ ట్రైన్ కు తృటిలో తప్పిన ప్రమాదం

**కర్నూలు**

ముంబై ఎక్స్ ప్రెస్ కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. కోసిగిలో ఘటన జరిగింది. భారీ ఈదురు గాలులకు ఇంజిన్పై చెట్టు కూలింది. గవిగట్టు రైల్వే గేటు వద్ద ఘటన.చెన్నై నుంచి ముంబై వెళ్ళే రైలు గంటకు పైగా ఆలస్యంగా బయలు దేరింది.

# హైదరాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్ :**

హైదరాబాద్ చింతల్ పరిసర ప్రాంతాల గుండా ప్రయాణించేవారికి ట్రాఫిక్ పోలీసులు ఓ సూచన చేశారు. చింతల్ మార్కెట్ వద్ద ట్విన్సు బాక్స్ కల్వర్టుపై జీహెచ్ఎంసీ పనుల కోసం నెల రోజుల పాటు ట్రాపిక్ ఆంక్షలు విధించారు. పత్రికా ప్రకటన ప్రకారం... జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జీహెచ్ఎంసీ నేటి నుంచి నెల రోజుల పాటు పనులు చేపట్టనుంది. ఈ క్రమంలోనే ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 28వ తేదీ వరకు ఆ ప్రాంతంలోని పలు మార్గాల్లో ట్రాఫిక్ ను మళ్లించారు. రద్దీని నివారించడానికి తిగిన ప్రత్యామ్నాయ రహదారులను ఉపయోగించాలని ప్రయాణికులకు అధికారులు సూచించారు. చింతల్ మెయిన్ రోడ్డు నుంచి పద్మానగర్ రింగ్ రోడ్డు వైపు ట్రాఫిక్ ఎల్లమ్మ దేవాలయం-ఎడమ వైపు-వాణి నగర్-కుత్బుల్లాపూర్ గ్రామం వద్ద మళ్లించబడుతుంది. పద్మానగర్ రింగ్ రోడ్డు నుంచి ట్రాఫిక్ ను మాణిక్య నగర్ కమాన్-ఢిల్లీ పబ్లిక్ స్కూల్ - పాండు విగ్రహం - చింతల్ ప్రధాన రహదారిపై మళ్లిస్తారు. పద్మానగర్ రింగ్ రోడ్డు నుంచి వచ్చే ట్రాఫిక్ ఫైన్ చికెన్ మార్కెట్ - అంబేద్కర్ నగర్ రోడ్డు - అంబేద్కర్ విగ్రహం - కుడివైపు - రాంరెడ్డి నగర్ - రెయిన్ బో హైస్కూల్ ఐడీపీఎల్ మెయిన్ రోడ్డు వద్ద మళ్లించబడుతుంది. పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రయాణికులు, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. మే 18 వరకు మొత్తం 215 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని పార్కింగ్ స్థలాలు, సాధారణ ట్రాఫిక్ కోసం ప్రధాన మార్గాలు, స్టేడియంకు వెళ్లే మార్గాలతోపాటు స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాలను కవర్ చేసే 8 సెక్టార్లలో పోలీసులు మోహరించారు. మ్యాచ్ కు వచ్చే క్రికెట్ అభిమానులు ఏక్ మినార్ మస్జిద్ రోడ్, స్టేడియం రోడ్ , హిందూ ఆఫీస్ రోడ్ నుండి స్టేడియంకు యాక్సెస్ రోడ్లలోకి చేరుకోవచ్చు. పార్కింగ్ స్థలాలు, వేదిక మార్గాల్లో ఎక్కడ ఇబ్బంది పడకుండా వాహన దారులకు కోసం 324 అనేక సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రాంతాల్లోకి ఎవరు ముందుగా వస్తే వారి వాహనాలు అదే క్రమ పద్ధతిలో పార్క్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసారు.పార్కింగ్ను పార్కింగ్ రద్దీ నివారించడానికి, వేదికకు త్వరగా యాక్సెస్ చేయడానికి మెట్రో రైలు సేవలను కూడా ఉపయోగించుకునే అవకాశం కల్పించారు. ట్రాఫిక్ డైవర్షన్స్ ,అప్ డేట్స్ ఎప్పటికప్పుడు సమాచారం అందించేందు ఎఫ్ ఎమ్ సేవలను సైతం వినియోగించుకుంటున్నారు.హైదరాబాద్ ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ సమీపంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ అమలు చేయబోతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనను కూడా విడుదల చేశారు. మెట్రో స్టేషన్ వద్ద ఏజీ కాలనీ నుంచి లక్ష్మి కాంప్లెక్స్ వరకు నాలా పునర్నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్నారు. ఈ పనుల కారణంగా మూడు నెలల పాటు మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలోనే మార్చి 28వ తేదీ నుంచి జూలై 28వ తేదీ వరకు 90 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. నాలా పనులు జరుగుతున్న ప్రాంతాల్లోని ట్రాఫిక్ అవసరాన్ని బట్టి డైవర్ట్ చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

**నిజామాబాద్ :**

తెలంగాణ యూనివర్సిటీ ప్రారంభం నుంచి ఎప్పుడూ వివాదాల్లోనే ఉంటూ వస్తోంది. ఉన్నత విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్కు బాటలు వేయాల్సిన విశ్వవిద్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. వర్సిటీలో సిబ్బంది వర్గాలుగా చీలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వచ్చారు. అక్రమ నియామకాలు, వర్సిటీలో సమస్యలు పట్టించుకోక పోవటం, నిత్యం రిజిస్ట్రార్ల మార్పులు అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.అధికారుల మధ్య సమన్వయం లోపించి ఏడాదిన్నర కాలంగా సమావేశాలు లేక వర్సిటీలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి. వారం కింద జరిగిన భేటీలో అనూహ్య నిర్ణయాలతో అందరిని ఆశ్చర్య పరిచింది పాలక మండలి. తాజాగా మరోమారు జరిపిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. వీసీపైనే విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించడం, ఇన్చార్జి రిజిస్ట్రార్ గా ఉన్న ప్రొఫెసర్ విద్యా వర్ధినిని సస్పెండ్ చేశారు. వీసీపై ఏసీబీ విచారించాలని నిర్ణయించడం సంచలన నిర్ణయమే. అకడమిక్ కన్సల్టెంట్ విధుల్లో నుంచి తొలగింపు నిర్ణయంతో పాటు వారం రోజుల్లోనే పదోన్నతుల రద్దు, అడ్వాన్సులు తీసుకున్న వారికి రికవరీ నోటీసుల జారీ వంటి నిర్ణయాలు జరిగిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసినా ఇంకా బడ్జెట్ ఆమోదం పొందలేదు. రెండు సమావేశాల్లో దీనిపై చర్చించినా చేసిన ఖర్చులకు సరైన లెక్కలు లేవని అధికారులు సమాధానం ఇచ్చారు. గడిచిన 8 నెలల కాలంలో వివిధ కార్యక్రమాల పేరిట పెద్ద మొత్తంలో వ్యయాలు చేసినట్లు వివరించారు. ఎక్కువ మొత్తం నోట్ ఫైల్ లేకుండా డబ్బులు డ్రా చేయటం జరిగిందని చెప్పారు. వీటిని ఏ ప్రాతిపదికన చేశారు? ఇప్పుడెలా లెక్క చూపాలి? అన్నది తేలాల్సి ఉందన్నారు. చెల్లింపుల విషయంలో నిబంధనలు పాటించలేదని వివరించారు. దీంతో మళ్లీ బడ్జెట్ పక్కకు పెట్టారు. దీనికి ఆమోదం లభిస్తేనే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 పద్దు ప్రతిపాదనల ఆమోదంపై ముందుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో రెండు బడ్జెట్లపై పీటముడి వీడలేదు. సమస్యను అధిగమించేందుకు నిధుల దుర్వినియోగం అంశంపై విచారణ పూర్తిచేయాలని నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఖర్చులపై విచారించేందుకు ఐదుగురి సభ్యుల కమిటీ వర్సిటీకి రానుంది. బడ్జెట్ ఆమోదం లేకుండా ఎంత ఆర్థిక వ్యయాలు చేశారు? అందులో నోట్ ఫైల్ లేకుండా ఎన్ని ఉన్నాయి? వాటిని ఎందుకు చేశారో? పరిశీలించనున్నారు. ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి చంద్రకళ నేతృత్వంలో కమిటీ ఆయా అంశాలు పరిశీలించనుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఫైళ్ల ఆధారంగా సిద్ధం చేయాలని ఇప్పటికే రిజిస్ట్రార్ కు సూచించింది. సిబ్బంది ద్వారా కొంత సమాచారం సిద్ధం చేసినట్లు సమాచారం. వీటిల్లో కీలకంగా ఉత్తర్వులు లేకుండా జరిపిన చెల్లింపులు, వర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు చేసిన ఖర్చులున్నాయి. వీటిపై వివరాలు సేకరించి చెక్కులు తయారు చేయటానికి ఉన్న నిబంధనలు పాటించారా? ఆ చెక్కును అనుమతిస్తూ సంతకాలు చేసేప్పుడు సరి చూశారా? అనే విషయాలు కీలకం కానున్నాయి. పాలక మండలిలో వీసీకి మిగతా సభ్యులకు పొసగకపోవటం... ఇష్టారీతిలో జరిగిన అక్రమ నియామకాల బాగోతం వర్సిటీ పరువు దిగజారుతోంది. వర్సిటీలో అనేక సమస్యలు ఉన్నాయి వాటిని ఇకనైనా సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# దేశంలో అతిపెద్ద స్కాం ఆర్ ఆర్ ఆర్ లీజు

**హైదరాబాద్**

2004 లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారు. హైదరాబాద్ మహా నగరానికి మణిహారంగా ఔటర్ రింగ్ రోడ్ ను నిర్మించింది. ఇందుకోసం 6696 కోట్లు గత రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు పెట్టిందని టీపీపీపీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం అయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఔటర్ రింగ్ రోడ్డును కాంగ్రెస్ నిర్మించింది. తెలంగాణకు పెట్టుబడులు పెడుతున్నారంటే... విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ ప్రామాణికం. గత 4 సంవత్సరాల నుంచి టోల్ ను ఈగల్న్యా కు కట్టబెట్టారు. ఔటర్ రింగ్ రోడ్ ను ఆదాయ వనరుగా కేటీఆర్ మిత్రబృందం ఉపయోగించుకుంది. ఈ ఆదాయాన్ని శాశ్వతంగా ఉపయోగించుకునెందుకు కేటీర్ కుటుంబం ఆలోచించింది. తమ కుటుంబానికి లాభం ఉండదని 30 సంవత్సరాలు ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డును కేటీఆర్ ప్రయివేటుకు తాకట్టు పెట్టారు. వేల కోట్ల ఆదాయం వచ్చే రింగ్ రోడ్ ను ప్రయివేటుకు అమ్మేశారు.పెట్టుబడులు



అంటే నూతనన్న్యా స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలి.కానీ ఉన్నవాటిని తాకట్టు పెట్టడం కాదు..కనీసం 30వేల కోట్లు ఆదాయం వచ్చే ఔటర్ 7380 కొట్లకే ముంబై కంపెనీకి తాకట్టు పెట్టారు.దీని వెనక సోమేశ్ కుమార్ వ్యవహారం నడిపాడు. అరవింద్ కుమార్ సంతకం పెట్టారు. దేశంలోనే ఇది అత్యంత పెద్ద కుంభకోణం. ఇందులో 1000 కోట్లు చేతులు మారాయి. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించదు. మేం అధికారంలోకి వచ్చాక మొట్టమొదట వీటిపై విచారిస్తాం. యాజమాన్యం కూడా జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నామని అన్నారు. సోమేశ్ కుమార్, అరవింద్ కుమార్, జయేష్ రంజన్ నిర్ణయాలన్నింటిపై కాంగ్రెస్ పార్టీ సమీక్షిస్తుంది. ఈ నిర్ణయాలపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది. ప్రజల ఆస్తులు కేసీఆర్ అమ్ముతుంటే బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదు. దీనిపై బీజేపీ నేతలు కూడా స్పందించాలి. ప్రజలు ఔటర్ రింగ్ రోడ్ ను వినియోగించే పరిస్థితులు లేవు. టెండర్ విధానాలపై విచారణ సంస్థలన్నింటికి పిర్యాదు చేస్తాం. వాస్తవంగా ఇంతకు ముందు దీన్ని ఆదానికి కట్టబెట్టాలని చూశారు. ఆరోపణల నేపథ్యంలో ముంబై కంపెనీకి తాకట్టు పెట్టారని అన్నారు. 2018 నుంచి ఎవరికి టోల్ వసూలు బాధ్యత ఇచ్చారో హెచ్ఎండీఏ అధికారులు బయట పెట్టాలి. ప్రజలకు అవసరమయ్యే ఔటర్ రింగ్ రోడ్ ను ఇప్పుడు అమ్మాల్సిన అవసరం ఏం వచ్చిందని అన్నారు.

## రూ. 5,03,000 విలువైన సరుకు జప్తు

**కాకినాడ:**

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా; రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి శనివారం నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద ఏడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ. 5,03,000 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా వంట గ్యాస్ సిలిండర్ను వ్యాపార అవసరాలకు వినియోగించిన దుకాణ యజమానిపై రూ. 10 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6 ఏ ప్రకారం కేసులు నమోదు చేసి, జాయింట్ కలెక్టర్ వారి కోర్టు ముందుంచుతారు. కేసుల్లో ప్రతివాదులను జాయింట్ కలెక్టర్ విచారించి.. తీసుకోవాల్సిన చర్యలకు, సీజ్ చేసిన సరుకులను ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీచేస్తారు.

## వార్డుల్లో అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

**నందికొట్కూర్ :**

అడిగినా ప్రయోజనం లేదు.. గత సమావేశంలో అడిగిన సమస్యలు అలాగే ఉ న్నాయి.. ఏదో టీ, బిస్కట్ల కోసం సమావేశానికి వచ్చినట్లుంది' అని ప లువురు కౌన్సిలర్లు లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని.కుక్కల దాడులు, పందుల బెడద, పారిశుద్ధ్యం అధ్వానం, బిల్లులు, చెల్లింపులకే పరిమితమైన ఎజెండా, రెండేళ్లు ఏళ్లు గడిచినా, వార్డుల్లో చెప్పదగిన పనులు లేవు' అంటూ నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిలర్లు రుసరుసలాడారు. ప్రతిపక్ష సభ్యులతో పాటు, అధికార వైసీపీ సభ్యులు సమస్యలను ఏకరవు పెట్టారు. పోడియం ముందు నిరసన తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీలోని లో శనివారం ఛైర్పర్సన్ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పురపాలిక సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. కౌన్సిలర్గా ఎన్నికైనప్పటినుంచి గడిచినా అభివృద్ధి చేయలేదని, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీలు నగరంలోని ఏ డివిజన్ చూసినా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవు. ఆయా అంశాలపై కార్పొరేటర్లు ఇప్పటి వరకు కౌన్సిల్ సమావేశాల్లో ప్రశ్నించింది లేదు. 28 మంది మున్సిపల్ కౌన్సిలర్లు వైకాపాకు చెందిన వారే కావడంతో సమావేశాలను మొక్కుబడిగా ముగుస్తున్న పరిస్థితి. ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో కౌన్సిలర్లు గ్రూపులుగా విడిపోయారు. ఈ సారైనా ప్రజా సమస్యలపై గళం విప్పుతారా అని ప్రజలు ఎదురుచూసిన ఫలితం శూన్యం. మరో వైపు కర్నూల్ గుంటూరు రహదారి నరకాన్ని తలపిస్తున్నాయి. లక్షలతో ప్రారంభించిన డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మారుతి నగర్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ హాజీ నగర్ శేష సేన రెడ్డి నగర్ ప్రధానమైన వార్డుల్లో సమస్య అలాగే ఉంది. వీటన్నింటిపైనా గళం విప్పి నగరాభివృద్ధి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా అదేవిధంగా కొంతమంది అధికారులు డైలీ వేజిగా ఉన్న కార్మికులను తమ సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారంటూ వైస్ చైర్మన్ రబ్బాని. కౌన్సిలర్ జాకీరు ధర్మారెడ్డి కమిషనర్ కిషోర్ దృష్టికి తీసుకుపోయారు కాబట్టి ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి పరిశుద్ధం పైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంతి కృష్ణవేణి. శాంత కుమారి. రాధిక నాయబ్ చాంద్ బాషా సూరి జయమ్మ మందాడి వాణి లాలుమున్సిపల్ కమిషనర్ కిషోర్ డిఇ నయాబ్ రసూల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆశీర్వాదమ్మ విద్యుత్ శాఖ ఏఈ రాములు నాయక్ టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య. భాను ప్రతాప్. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కష్టపడితేనే ఆర్టీసీకి మనుగడ

**జగిత్యాల**

నష్టాలలో ఉన్న ఆర్టీసీని కాపాడుకునేందుకు ప్రతి ఉద్యోగి కష్టపడితేనే సంస్థ క్లిష్ట పరిస్థితి నుండి బయట పడుతుందని జగిత్యాల డిపో మేనేజర్ నరసప్ప అన్నారు. శనివారం జగిత్యాల డిపో ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో డిపో మేనేజర్ నరసప్ప పాల్గొని మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న సంస్థను పరిరక్షించుకునేందుకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించిన అపాయంలో ఉపాయంను ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ప్రతి ఉద్యోగి పై ఉందన్నారు. ప్రతి కండక్టర్, డ్రైవర్ ప్రయాణికుడిని ఓ ప్యాసింజర్ల చూడకుండా సంస్థకు వినియోగ వినియోగదారునిల మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని వారికి వివరిస్తూ వారు ఆయా పథకాల్లో చేరేలా చూడాలన్నారు. ప్యాసింజర్ల పట్ల ఆర్టీసీ ఉద్యోగులు మర్యాద పాటిస్తూ వారు ఆపమన్నచోట బస్సులు నిలిపి దింపాలన్నారు. ప్రతి నెల అప్పులు తెచ్చుకొని జీతాలు తీసుకోకునే పరిస్థితి కాకుండా బోనస్ లు అందుకునేలా సంస్థ పురోభివృద్ధికి ప్రతి కండక్టర్ డ్రైవర్ కు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి నిత్యం ప్రయాణించే ప్రయాణికుల పట్ల కూడా కండక్టర్, డ్రైవర్లు గౌరవంగా మెదగాలన్నారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సంస్థ కు చెందిన ఉద్యోగులను గ్రామాల్లో విలేజ్ బస్ ఆఫీసర్ల ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) విజయలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానిక్)కవితా రెడ్డి సి ఆర్ సి వినయ్ కుమార్, సేఫ్టీ వార్డెన్ సదానందం తో పాటు ఎస్ జె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com

# చిన్న వర్షానికే హైదరాబాద్‌లో దారుణం

**రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షం**

**హైదరాబాద్‌లో ఓ చిన్నారిని బలి తీసుకుంది**

**హైదరాబాద్**

కింద్రాబాద్ కళాసిగూడలో విషాదం చోటుచేసుకుంది. జీఎచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలైపోయింది. మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉండడంతో ఆ చిన్నారి డ్రైనేజీలో పడిపోయింది. వివరాల్లోకి వెళ్తే స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న మౌనిక అనే అమ్మాయి ఉదయం పాల ప్యాకేట్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చింది. అయితే రోడ్డుపై వెళ్తుండగా తెరిచి ఉన్న మ్యాన్ హోల్‌ను గమనించకపోవడంతో అందులోనే పడిపోయింది. పార్క్ లైన్ వద్ద పాప మృత దేహాన్ని డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. పాలకోసం వెళ్లిన నాలుగోతరగతి చదువుతున్న చిన్నారి మౌనికను మురికి కాలవ బలితీసుకుంది. చిన్నపాటి వర్షానికే నాలా పొంగి చిన్నారి ప్రాణం తీసింది. నాలాలో కొట్టుకుపోయిన చిన్నారి పార్క్‌లైన్ వద్ద శవమైతేలింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షం హైదరాబాద్‌లో ఓ చిన్నారిని బలి తీసుకుంది. నాలోలో పడిన నాల్గో తరగతి చదువుతున్న మౌనిక అనే బాలిక మృతి చెందింది. సికింద్రాబాద్‌లోని కళాసిగూడలో దారుణం జరిగింది. నాల్గో తరగతి చదువుతున్న మౌనిక అనే బాలికను నాలా మింగేసింది. ఉదయాన్నే పాల కోసం వెళ్లిన బాలిక కంటికి కనిపించని నీటితో నిండిపోయిన ఉన్న నాలాలో పడిపోయింది. ఇదంతా జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే అంటున్నారు స్థానికులు, రెండు గంటల పాటు వర్షానికి ఇలాంటి పరిస్థితి ఉంటే... రేపు వర్షాకాలంలో పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. చిన్నారి మృతితో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ప్రమాదం, వర్షానికి నీరు నిలిచిపోయిన రోడ్లను కేటీఆర్‌కు ట్యాగ్ చేసి వేర్వేరు పార్టీ సానుభూతిపరులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. మూడు గంటలకు పైగాగా పడిన వర్షంతో నగర వీధులన్నీ నదుల్లా ప్రవహించాయి. పొద్దున్నే పనుల కోసం బయటకు వచ్చిన వారు వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది..మరోవైపు వర్షంతో ట్రాఫిక్ జామ్ సమస్య కూడా నెలకొంటుంది.భారీ వర్షంతో నగరంలోని చాలా ప్రాంతాలల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. బంజారాహిల్స్. అమీర్‌పేట, పంజాగుట్ట, కూకట్‌పల్లి. సికింద్రాబాద్, మెహదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, మల్కాజిగిరిలతో ఆటు పాతబస్తీలో ఇదే పరిస్థితి కనిపించింది.

తెలంగాణ వ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులతో పాటు కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు ఆదివారం, సోమవారాల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వడగళ్ల వానలు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. మిగిలిన ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది వాతావరణ శాఖ. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైతేనే బయటికి రావాలని సూచించారు అధికారులు. కాగా, వచ్చే రెండు, మూడు గంటలు హైదరాబాద్‌లో కుండబోతు వర్షం కురిసే అవకాశముందని హెచ్చరించింది.

# ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య తీవ్ర స్థాయికి చేరుతున్న సమరం

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సమరం మళ్లీ తీవ్ర స్థాయికి చేరేలా కనిపిస్తోంది. ఇప్పటికే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాంటూ నెత్తీ నోరు మొత్తుకున్న ఉద్యోగులు.. ఇక తాడోపేడో తేల్చుకుంటామంటున్నారు. ఆదివారం వరకు డెడ్ లైన్ పెట్టి.. తుది ఉద్యమ కార్యచరణపై ప్రకటన చేశారు. ప్రభుత్వం చర్చలు జరుపుతూ ఇక సమస్య పరిష్కారం అయినట్లేనని చెబుతున్నా.. అవి కార్యరూపం దాల్చేవరకు వెనక్కి తగ్గేది లేదంటున్నాయి ఉద్యోగ సంఘాలు. తాజాగా ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీ ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి..గత 50రోజులుగా ఉద్యమం చేస్తున్నామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు . ప్రభుత్వం నిన్నటి వరకు చర్చలు జరపకుండా చివరి నిమిషంలో పిలిచి అనధికారిక చర్చలన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని.. డీఏ, సరెండర్ లీవ్‌లు ఎప్పుడు ఇస్తారో ఇంకా చెప్పలేదన్నారు. ఇవాళ్టి నుంచి గ్రామ, వార్డు సచివాలయ సమస్యలపై ధర్నా చేస్తున్నట్లు ప్రకటించిన బొప్పరాజు ఈనెల 30న తుది కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాలతో పాటు, ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్ల రౌండ్‌టేబుల్ భేటీలో పాల్గొ?న్నారు. ఈ సమావేశానికి వచ్చిన పలు ఉద్యోగ సంఘాలు నేతలు సైతం అధికార ప్రభుత్వం.. ఉద్యోగుల పట్ల అనుకూలంగా లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాలను విభజించు-పాలించు విధానాన్ని అవలంభిస్తోందని ఆరోపించారు. చివరికి అన్ని సంఘాలతో కలుపుకుని తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి శ్రీకారం చుట్టడంతో పాటు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.

# వైకాపా పథకాలకు ఆత్మీయ పలకరింపులు

**ఏలూరు**

పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం తూర్పు పాలెం క్యాంపు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు మాట్లాడుతూ నియోజక వర్గంలో 58 గ్రామాల్లో 146 రోజులు పర్యటించి 65వేల కుటుంబాలను సందర్శించడం జరిగింది.వైఎస్సార్సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ మెగా ఉద్యమానికి అనూహ్య స్పందన లభిస్తోందని అన్నారు.వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు చేస్తున్న మేలును వివరించి ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాలు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైయస్ఆర్ సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం అని అన్నారు.ఏ ఇంటికి వెళ్లినా ఆత్మీయ పలకరింపులు, ప్రభుత్వ పనితీరుపై ఎవరిని కదిపినా హర్షాతిరేకాలు.. మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నది తమ ఆకాంక్ష అంటున్నారు.మొబైల్ ఫోన్కు వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను ఇష్టంగా అతికించుకున్నారు.82960 82960 నంబర్కు మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలుపుతున్నారు. దాదాపు నాలుగేళ్లుగా వైయస్ఆర్సీపీ ప్రభుత్వం తమ వెంటే ఉందని, తమ బాగోగులు చూసుకుంటోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు . అనంతరం రాజమండ్రి రుడా చైర్మన్ ఆచంట నియోజకవర్గ పార్టీ పరసీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూప్రతి ఒక్కరూ తన మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని అందరూ ఇంత ఆనందంగా ఉన్నారంటే మంచి మనిషి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిని అందరూ దీవించాలని, వచ్చే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేసి ఆ స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఎంసి చైర్మన్లు చిల్లే లావణ్య , మిస్సమ్మ ,ఎంపిపి కర్రి వాసురెడ్డి మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బైజుస్ సీఈవో ఇంట్లో సోదాలు, విదేశీ నిధుల్లో అవకతవకలపై ఆరా

**బెంగళూరు**

బైజుస్ సీఈవో రవీంద్రన్ ఇంట్లో ఈడీ రెయిడ్స్ జరిగాయి. బెంగళూరులోని ఆయన ఇంట్లో సోదాలు చేపట్టింది. విదేశీ నిధుల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తోంది ఈడీ. రవీంద్రన్‌కు చెందిన ఇంటితో పాటు ఆయన బిజినెస్ ఆఫీస్‌లలోనూ సోదాలు జరిగాయి. ఇప్పటికే ఆయనపై కేసు నమోదైంది. ఎష్ప్రతినిని ఢ ఒవజీతీని ఖతీతిలజీబివ ఒతిఎతిబివట కంపెనీకి సంబంధించి విదేశీ నిధుల విషయంలో నిబంధనలు ఉల్లంఘించారని ఈడీ చెబుతోంది. నిబంధనల్ని అతిక్రమించారని ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే కొన్ని డాక్యుమెంట్‌లతో పాటు డేటాను కూడా సీజ్ చేసినట్టు వెల్లడించింది. ఈ సోదాలపై బైజుస్ సీఈవో రవీంద్రన్ స్పందించారు. ఇది కేవలం రొటీన్ ఎంక్వైరీ అని తేల్చి చెప్పారు. "ఈడీ అధికారులు వచ్చి సోదాలు చేశారు. వాళ్లకు పూర్తి సహకారం అందించాం. వాళ్లకు కావాల్సిన సమాచారం అంతా అందించాం. పారదర్శకంగానే ఉన్నాం. మా కంపెనీపై పూర్తి నమ్మకముంది. మా ఎతిక్స్‌ను ఎప్పుడూ మీరలేదు. వాటికి ఎప్పటికీ కట్టుబడి ఉంటాం"- రవీంద్రన్, బైజుస్ సీఈవో ఫెమా సోదాల్లో కీలక వివరాలు వెల్లడయ్యాయి. కంపెనీకి రూ.28 వేల కోట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా అందాయని తెలిపింది. 2011-2023 మధ్య కాలంలో ఈ నిధులు వచ్చినట్టు స్పష్టం చేసింది. ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా బైజుస్ కంపెనీ పలు విదేశీ సంస్థలకు రూ.9,754 కోట్లు పంపింది. ఈ కంపెనీపై వచ్చిన కంప్లెయింట్‌ల ఆధారంగానే సోదాలు నిర్వహించినట్టు వెల్లడించారు అధికారులు. ఇప్పటికే సమన్లు జారీ చేసినప్పటికీ ఈడీ ముందు రవీంద్రన్ హాజరు కాలేదన్న ఆరోపణలున్నాయి. అడ్వర్‌టైజ్‌మెంట్, మార్కెటింగ్ కోసం రూ.944 కోట్లు ఖర్చు చేసినట్టు ఈడీ వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీ ఇచ్చిన లెక్కల్ని అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంకింగ్ అఫీషియల్స్‌తో సంప్రదించిన తరవాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపింది.

లేఆఫ్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. వరుసగా పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. కాస్ట్ కటింగ్‌లో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ ఃఎతీబీబకూడా ఇదే బాట పట్టింది. ఇప్పటికే ఓ విడత లేఆఫ్‌లు అమలు చేసిన ఈ కంపెనీ రెండో ఫేజ్‌నూ మొదలు పెట్టింది. ఈ సారి 1000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ఓ నివేదిక అంచనా వేసింది. ఆర్నెల్ల కాలంలోనే ఈ కోతలు విధిస్తూ పోతోంది బైజూస్. డిజైన్, ప్రొడక్షన్, ఇంజనీరింగ్ విభాగాల్లో ఈ సారి లేఆఫ్‌లు ఉండనున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలోని ఉద్యోగులకే ముప్పు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ డిపార్ట్‌మెంట్‌లో కనీసం 300 మందికి పింక్ స్లిప్ చూపించనున్నారు. లాభాల్లో నడిచేందుకు వీలుగా..మొదటి విడతలో 2,500 మంది ఉద్యోగులను తొలగించింది బైజూస్.

# స్కిల్ స్కాం కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ

**విజయవాడ**

గత ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు డిజైన్ టెక్ కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్ డ్ డిపాజిట్లను శుక్రవారం జప్తు చేసింది. ఇదే కేసులో మార్చి నెల 10 వ తేదీన నలుగురిని అరెస్ట్ చేసింది. విశాఖ స్పెషల్ కోర్టులో నలుగురినీ హాజరుపర్చిన ఈడీ... కోర్టు ఆదేశాలతో జ్యుడిషియల్ రిమాండ్‌ను తరలించింది. ఈ కేసులో సిమెన్స్ మాజీ ఎండీ శేఖర్ బోస్ సహా నలుగురు అరెస్ట్ అయ్యారు. డీజీ టెక్ ఎండీ వికాస్ వినాయక్, పీపీఎస్‌పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్ సీవోవో ముకుల్‌చంద్ర అగర్వాల్, ఎస్ఎస్ఆర్ అసోసియేట్స్ సురేష్ గోయల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఏపీ సీఐడీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది.

ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ స్కామ్ లో సీఐడీ అధికారులు విచారణను వేగవంతం చేశారు. కేసు విచారణలో భాగంగా సీమెన్స్ ఇండస్ట్రీయల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జీవీఎస్ భాస్కర్ ను ఏపీ సీఐడీ పోలీసులు యూపీలోని నోయిడాలో ఇటీవల అరెస్ట్ చేశారు. బుధవారం ఏపీ సీఐడీ నోయిడాలోని ఆయన నివాసానికి వెళ్లి భాస్కర్ ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా.. విజయవాడలోని కోర్టులో హాజరు పరిచేందుకుగానూ 36 గంటల సమయం ట్రాన్సిట్ రిమాండ్ విధించారు. ఇతర నిందితులతో కలిసి సిమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విలువను కృత్రిమంగా రూ. 3300 కోట్లకు పెంచి, ప్రాజెక్ట్ రిపోర్టును తయారు చేశారని భాస్కర్ పై ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యవయంలో 10 శాతం చెల్లింపులలో భాగంగా అదనంగా రూ. 371 కోట్ల భారం ఏర్పడింది. కానీ సిమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఇచ్చిన సాఫ్ట్‌వేర్ ధర కేవలం రూ. 58 కోట్లు అని బిల్లులు చేసి ఉంది. జి.వి.ఎస్.భాస్కర్ ప్రాజెక్ట్ అంచనాలను తారుమారు చేసి రూ. 3300 కోట్లకు చేర్చాడని ఏపీ సీఐడీ అభియోగాలు నమోదు చేసింది.సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టెక్నాలజీ అందిస్తున్న పార్ట్ నర్ ఈ ప్రాజెక్ట్ ఖర్చులో 90 శాతం వాటాను అందించాలని భావించారు. కానీ భాస్కర్, మరికొందరు నిందితులు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో కలిసి, అవగాహన ఒప్పందాన్ని తారుమారు చేయడానికి కుట్ర చేసినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. మరోవైపు ఎలాంటి సాఫ్ట్ వేర్ ఇవ్వకున్నా, ఇచ్చినట్టుగా రికార్డులు సృష్టించారని సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. సిమెన్స్ + డిజైన్‌టెక్ షెల్ కంపెనీలకు రూ.371 కోట్ల పనులు అప్పగించినట్లు ఒప్పందం జరిగింది. అయితే టెక్ సపోర్ట్ అందించే కంపెనీలు ప్రాజెక్టులో 90 శాతం మేర వాటాను భరించాలని సైతం నిర్ణయించారు. అనంతరం ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తాజాగా డిజైన్ టెక్ కు చెందిన డిపాజిట్లను ఈడీ జప్తు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# జడ్పీ స్కూల్ లో గ్రంథాలయం


**కాకినాడ**

విద్యార్థుల నైపుణ్యతను పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని, కరప జెడ్.పి.స్కూల్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన 1995-96 టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. కాకినాడ జిల్లా , కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని మండల కేంద్రం కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో1995 -96 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒక లక్షా ఐదు వేల రూపాయలతో వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు చదువుకునే ఎందుకు ఉపయోగపడే విధంగా సేకరించి వారు చదువుకునేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పుస్తకాలతో పాటు విద్యార్థులు కూర్చుని చదివే విధంగా నూతన ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఎంపీపీ పెంకే శ్రీ లక్ష్మి సత్తిబాబు, జడ్పిటిసి సభ్యులు యాళ్ల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పూర్వ విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు గ్రంథాలయం లోని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో1995 - టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తుమ్మలపల్లి సత్తిబాబు, రవి, రామారావు, మండల వైఎస్ఆర్ సిపిఅధ్యక్షులు చింతా ఈశ్వరరావు, ఎంపీడీవో స్వప్న, ఎంఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

# వైసీపీ రీజినల్ కో- ఆర్డినేటర్ పదవికి బాలినేని రాజీనామా

**ప్రకాశం:**

వైసీపీ అధిష్టానంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. వైసీపీ రీజినల్ కో- ఆర్డినేటర్ పదవికి బాలినేని రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ కార్యాలయానికి పంపించినట్లు తెలుస్తోంది. మంత్రి పదవి నుంచి బాలినేనిని తప్పించిన జగన్ ఆయనను ప్రస్తుతం చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల వైసీపీ సమన్వయ కర్తగా నియమించారు. అయితే జిల్లాకు చెందిన ఆదిమూలపు సురేష్‌కు జగన్ కేబినెట్‌లో రెండో సారి చోటు దక్కింది. దీనిపై బాలినేని ఆగ్రహంతో ఉన్నారు. అలాగే తనకు వ్యతిరేకంగా పార్టీలో కొంతమంది పనిచేస్తున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇటీవల మార్కాపురంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ వద్ద పోలీసులు తనను అడ్డుకోవడంపై బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేస్తే తప్ప బాలినేని వేదికపైకి రాలేదు. ప్రోటోకాల్ ఇష్యూ నుంచి పార్టీ అధిష్టానంపై బాలినేని గుర్రుగా



ఉన్నారు.ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత, వైఎస్ జగన్‌కు దగ్గరి బంధువైన బాలినేని.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నుంచి జగన్‌తో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో మంత్రి పదవిని కూడా త్యాగం చేసి జగన్ పార్టీలో చేరారు. ఒంగోలులో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ తరుపున మొదటి సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి జగన్ వెంటే ఉంటూ వచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాలినేని మంత్రి పదవి చేపట్టారు. కానీ మూడేళ్లు తిరిగే సరికి ఆయనను జగన్ పక్కనపెట్టేశారు. అదే సమయంలో జిల్లాలో మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిమూలపు సురేష్‌ను మరోసారి మంత్రిగా కొనసాగించారు. అయితే జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రుల్లో ఒకరిని తొలగించి మరొకరిని కొనసాగించడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయని అప్పట్లోనే జగన్‌కు బాలినేని వివరించారు. అయినప్పటికీ బాలినేని మాటలను పట్టించుకోని జగన్.. మంత్రిపదవి నుంచి బాలినేని తొలగించి.. ఆదిమూలపు సురేష్‌ను పురపాలక శాఖ మంత్రిగా కొనసాగించారు. దీంతో అప్పటి నుంచి జిల్లాలో ప్రొటోకాల్ విషయంలో బాలినేని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల పరుచూరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకం విషయంలో బాలినేని చెప్పిన సూచనలు పట్టించుకోని పరిస్థితి. అయితే మంత్రి పదవి నుంచి బాలినేనిని తొలగించడం, ఆపై మార్కాపురంలో ప్రోటోకాల్ విషయంలో అసంతృప్తితో ఉన్న బాలినేని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే జిల్లాలో ముఖ్యమైన లీడర్‌గా ఉన్న బాలినేని... వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయడం.. జిల్లా రాజకీయాలతో పాటు వైసీపీలో కలకలం రేపుతోంది.

# ఆన్ని సౌకర్యాలతో ప్రభుత్వ బడులు ప్రారంభించాలి

**తిరుపతి**

రానున్న విద్యా సంవత్సరం ప్రభుత్వ బడులలో పూర్తి సౌకర్యాలు కల్పించి, జగనన్న విద్యాకానుక అందించి జూన్ 12 న పండుగ వాతావరణంలో ప్రారంభానికి సిద్ధంగా వుండాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు రానున్న విద్యాసంవత్సరంలో బడులలో అన్ని వసతులు కలిగివుండాలని, ప్రారంభం రోజే పిల్లలకు విద్యాకానుక అందించేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేక సూచనలు ఇచ్చారని అన్నారు. విద్యాకానుక అందిన వెంటనే అందులోని ప్రతి వస్తువు నాణ్యత పరిశీలించాలని, క్వాలిటీ వాల్ ఏర్పాటు చేసి స్థానిక ప్రజలను, ప్రజాప్రతినిధులను స్వయంగా పరిశీలించే విధంగా ఆడిట్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని సూచించారు. నాణ్యతాలోపం వుంటే మార్పుకు అవకాశం వుందని అన్నారు. విద్యాకానుక కిట్లు త్వరగానే మండల స్టాక్ పాయింట్లకు చేరుతాయని, వాటి నాణ్యత పరిశీలన పూర్తిచేయాలని అన్నారు.

గత సంవత్సరం పదవతరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులు 637 మంది వున్నారని వారిని తప్పనిసరి గుర్తించి టీచర్లకు సబ్జెక్ట్ భోదనకు అనుసంధానం చేయాలని, సమ్మతి చూపని వారిని ఖాళీగా ఉంచరాదని యవ వయస్సు వారిదని, తప్పనిసరి స్కిల్ డెవెలప్ మెంట్ ద్వారా నచ్చిన రంగంలో సాంకేతిక శిక్షణ ఇప్పించాలని, శిక్షణ పూర్తిగా ఉచితమని , ఉపాది కల్పించడం జరుగుతుందని అన్నారు.

పాఠశాలలు తెరవడానికి మనకు దాదాపు 40 రోజుల సమయం వుందని నాడు ? నేడు పనులు పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి , పర్నిచర్ రిపేర్లు కిచెన్ షెడ్ల నిర్మాణాలు, పెయింటింగ్ వంటివి పూర్తికావాలని , వాచ్ మాన్ నియామకం పేరెంట్స్ కమిటీ సమావేశంలలో పూర్తికావాలని అన్నారు.

# నేచురల్ స్టార్ నాని సినిమా30లో శ్రుతి హాసన్



నేచురల్ స్టార్ నాని ల్యాండ్‌మార్క్ 30వ చిత్రం షూటింగ్ నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వంలో శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం గోవాలో ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సీతా రామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో కథానాయిక. తాజాగా శృతి హాసన్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ యేడాది ఆరంభంలో బ్లాక్ బస్టర్ వీరసింహారెడ్డితో అలరించిన శ్రుతి హాసన్ ఈరోజు గోవాలో షూటింగ్‌లో జాయిన్ అయింది. ఈ లెంతీ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మిస్తుండగా, కోటి పరుచూరి సిఒఒగా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్రంలో కొంతమంది ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సి డీవోపీగా, హృదయం ఫేమ్ కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతాన్ని అందిస్తున్నారు.

ప్రవీణ్ ఆంథోని ఎడిటర్ గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా, సతీష్ ఈవీవీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా పని చేస్తున్నారు.


తారాగణం: నాని, మృణాల్ ఠాకూర్, శ్రుతి హాసన్

# 'సెల్ఫిష్' ఫస్ట్ సింగిల్ దిల్ ఖుష్ మే1న విడుదల



తొలి చిత్రం 'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న యంగ్ హీరో ఆశిష్ రెడ్డి, నూతన దర్శకుడు కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్ , ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీష్ ల శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తున్న యూత్ ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్ 'సెల్ఫిష్' తో వస్తున్నాడు. ఆశిష్ మాస్ క్యారెక్టర్‌లో నటిస్తున్నాడు. ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో తన నిర్లక్ష్య వైఖరిని చూపించడం గమనించవచ్చు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950